స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com

PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 112 | బుధవారం, సెప్టెంబర్ 9, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 112 | WEDNESDAY, SEPTEMBER 9, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |



ప్రత్యేక ప్రాంతాలుగా

## అరుణాచల్, అక్సాయ్‌చిన్

• అక్సాయ్ చిన్‌కు పశ్చిమాన భారత్, తూర్పున చైనా • ఐక్యరాజ్య సమితి కొత్త మ్యాప్‌లో ప్రత్యక్షం?

2


## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లపై సస్పెన్షన్ వేటు

• స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంఎల్‌సీలను సస్పెండ్ చేస్తూ శాసన మండలి తీర్మానం • మూజువాణి ఓటుతో ఆమోదం • ప్రస్తుత సమావేశాలు ముగిసే వరకూ వారిపై వేటు • తాతా మధు వ్యాఖ్యలపై రెండో రోజూ రభస • మధు వ్యాఖ్యలకు ఆ పార్టీ అధినేత కెసిఆర్ బాధ్యత తీసుకోవాలని మరో తీర్మానం • గందరగోళం మధ్య అసెంబ్లీ వాయిదా • మొత్తం శాసనసభకు జరిగిన అవమానం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, సెప్టెంబర్ 8 (వార్త వేదిక సూర్య): తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆరఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత శాసనమండలి ఛైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించిన తర్వాత తాతా మధు, నవీన్ కుమార్‌రెడ్డిని ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు మిగతా 2లో..





## నా తల్లిని అన్నారు.. మీ తల్లిని కాదు

• మీకు కాదు ఆవేశం ఉండాల్సింది.. స్పీకర్‌గా నాకు ఉండాలి • హరీశ్‌రావుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ సీరియస్ • రెండో రోజూ వాడీవేడిగా అసెంబ్లీ సమావేశాలు • నల్ల బ్యాడ్జీలు ధరించి సభకు హాజరైన బీఆర్ఎస్ శాసనసభ్యులు • ఎంఎల్‌సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలపై గరంగరం • మరోవైపు మహిళా ఎంఎల్ఏలను అవమానించారంటూ హరీశ్‌రావు ఫైర్ • స్పీకర్‌ను బెదిరించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదు: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (వార్త వేదిక సూర్య): తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు తీవ్ర ఉద్రిక్తతల మధ్య సాగుతున్నాయి. అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం చోటుచేసుకున్న సంఘటనలు సభలో రెండో రోజు కూడా తీవ్ర దుమారాన్ని లేపాయి. ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి, అధికార కాంగ్రెస్ పార్టీల నాయకులు పరస్పరం చేసుకున్న తీవ్ర విమర్శలు, సభాపతిపై అనుచిత వ్యాఖ్యలు శాసనసభలో వేడిని పుట్టించాయి. రెండో రోజు సభ ప్రారంభమైన వెంటనే బీఆర్ఎస్ శాసనసభ్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి హాజరయ్యారు. గురువారం శాసనసభ వద్ద పోలీసుల ప్రవర్తనను నిరసిస్తూ వారు ఈ విధంగా తమ నిరసన తెలిపారు. సభలో మాట్లాడిన మాజీ మంత్రి హరీశ్ రావ్ అధికార పక్షం తీరుపై నిప్పులు చెరిగారు. తమ పార్టీకి చెందిన సీనియర్ మహిళా నాయకులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను పోలీసులు అవమానించారని, దీనిపై కనీస చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. చీర లాగడం, గొంతుపై నొక్కడం విషయాలను మాట్లాడారు. మహిళా ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళితే, తిరిగి వారిపైనే అక్రమ కేసులు మిగతా 2లో..



## కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు కట్టిపెట్టాలి

• ప్రజా సమస్యలను పక్కనపెట్టి అసెంబ్లీ సమయాన్ని వృథా చేస్తున్నారు • రెండు పార్టీలు కలిసి ప్రజలను పక్కదారి పట్టిస్తున్నాయి • ఇకనైనా సమస్యలపై చర్చించాలి: బండి సంజయ్

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (వార్తా వేదిక సూర్య): తెలంగాణ శాసనసభలో జరుగుతున్న పరిణామాలపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర నాయకుడు బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీలో వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో అసహ్యాన్ని కలిగిస్తోందని, రెండు మిగతా 2లో..

మహిళా నేతలపై దాడికి సిఎం రేవంత్

## సిగ్గుతో తలదించుకోవాలి

• సబిత, సునీతా లక్ష్మారెడ్డిలపై అత్యంత హేయంగా వ్యవహరించారు • ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే స్పీకర్‌ను అడ్డం పెట్టుకుని చిల్లర రాజకీయాలు • బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 8 (వార్త వేదిక సూర్య): మహిళా నేతలు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. మహిళా నాయకురాళ్లను చుట్టుముట్టి లాగడం, గొంతులు పట్టుకోవడం, చీరలు లాగడం ద్వారా ప్రభుత్వం 'దుశ్శాసన పర్వానికి' తెర తీసిందని మండిపడ్డారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. "క్రిమినల్ మనస్తత్వం కలిగిన ముఖ్యమంత్రి తెలంగాణకు రావడం ప్రజల దురదృష్టం. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై జరిగిన అవమానానికి ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి" అని మిగతా 2లో..




## పోలీస్ ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు

• సెప్టెంబర్ 16వరకు దరఖాస్తుల సమర్పణకు అవకాశం • తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (వార్త వేదిక సూర్య): తెలంగాణ రాష్ట్రంలో పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న వేలాది మంది నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు గడువును పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. మిగతా 2లో..




## ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల వయోపరిమితి పెంచాలి

• 7వేల పోస్టులు కాదు.. 20 వేల ఖాళీలను భర్తీ చేయాలి • వయోపరిమితి పెంచితే మరో 2-3 లక్షల మంది నిరుద్యోగులకు ప్రయోజనం: కవిత

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (వార్తా వేదిక సూర్య): ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల వయోపరిమితిని పెంచడంతో పాటు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 20 వేల పోలీసు పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులతో ఆమె సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవిత మిగతా 2లో..

బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్‌ను

## సద్వినియోగం చేసుకోండి

• యువత సృజనాత్మక ప్రతిభకు చక్కటి వేదిక • ఛాలెంజ్‌ను విజయవంతం చేయాలి: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (వార్తా వేదిక సూర్య): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్–2026'ను యువ ఫిలిం మేకర్స్ సద్వినియోగం చేసుకోవాలని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి.ముకుందరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్‌రెడ్డిలతో మిగతా 2లో..



## వాణిజ్యంపై ఫోకస్!

• ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులు • న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి లారెల్‌తో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి భేటీ



న్యూఢిల్లీ: తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి, ఆ దేశ క్యాబినెట్ సభ్యుడు ఫ్రాన్సిస్కో పి.టు లారెల్ జూనియర్‌తో సమావేశమయ్యారు. తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులను పెంచడంతోపాటు తెలంగాణ-ఫిలిప్పీన్స్ మధ్య వాణిజ్యాన్ని మరింత విస్తరించే అవకాశాలపై ఇరువురు నేతలు చర్చించారు. భారతదేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా అవతరించిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. భారీ పరిమాణంలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయగల ఉత్పత్తి సామర్థ్యం, ఆధునిక రైస్ మిల్లింగ్ వ్యవస్థ, అవసరమైన అనుభవం తెలంగాణకు ఉన్నాయని తెలిపారు. ఫిలిప్పీన్స్‌కు దిగుమతి చేసుకునే బియ్యం అవసరం గణనీయంగా ఉండటం, అంతర్జాతీయంగా బియ్యం సరఫరా చేసే దేశాల సంఖ్యను విస్తరించేందుకు ఆ దేశం ప్రయత్నిస్తుండటం నేపథ్యంలో ఈ చర్చలకు మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com వార్త వేదిక సూర్య తెలుగు దినపత్రిక VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి:2 | సంచిక: 112 బుధవారం 9 సెప్టెంబర్, 2026

## పోలీస్ ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థుల విజ్ఞప్తులు దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసిన నూతన ప్రకటన ప్రకారం, అభ్యర్థులు సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. నియామక ప్రకటన ప్రకారం తొలుత సెప్టెంబర్ 9వ తేదీని చివరి తేదీగా నిర్ణయించినప్పటికీ, తాజాగా ఆ గడువును మరో వారం రోజుల పాటు పొడిగించారు. కాగా, టీఎస్ఎల్ఆర్‌బీ జులై 29న విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా మొత్తం 7,437 పోస్టులను భర్తీ చేయనుంది. ఖాళీల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

పోలీస్ కానిస్టేబుల్ (సివిల్): 3,697 పోస్టులు

పోలీస్ కానిస్టేబుల్ (ఏఆర్): 1,052 పోస్టులు

స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్: 1,380 పోస్టులు

ఫైర్ ఫైటర్ (తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్, ఫైర్ సర్వీసెస్): 751 పోస్టులు

జైలు వార్డర్ (తెలంగాణ జైళ్ల శాఖ): 208 పోస్టులు

పోలీస్ కానిస్టేబుల్ (పురుషులు): 24 పోస్టులు

## ఇక వాణిజ్యంపై ఫోకస్!

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. పోటీ ధరలు, నాణ్యత, నిర్ణీత సమయంలో సరఫరా చేయగల సామర్థ్యంతో తెలంగాణ దీర్ఘకాలిక భాగస్వామిగా నిలవగలదని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బియ్యం రకాలు, ధరలు, నాణ్యతా ప్రమాణాలు, కొనుగోలు విధానాలు, రవాణా, ధ్రువీకరణ ప్రక్రియలు, శానిటరీ, ఫైటోశానిటరీ నిబంధనలపై కూడా ఇరువురు చర్చించారు. ఈ అంశాలను సంబంధిత అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు పరిశీలించి, వాణిజ్య అవకాశాలను కార్యరూపంలోకి తీసుకురావడానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించారు. భారత్–ఫిలిప్పీన్స్ సంబంధాలు, ఆహార భద్రత, వ్యవసాయ సహకారం, తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు ప్రత్యక్ష వాణిజ్యాన్ని పెంచే అవకాశాలపై కూడా ఇరువురు విస్తృతంగా చర్చించారు. భారత్–ఫిలిప్పీన్స్ మధ్య అభివృద్ధి చెందుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యంలో వ్యవసాయం, ఆహార వాణిజ్యం కీలక పాత్ర పోషించగలవని అభిప్రాయపడ్డారు.

## ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల వయోపరిమితి పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి నిరుద్యోగులే ప్రధాన కారణమని అన్నారు. కాంగ్రెస్ కోసం ఆ పార్టీ కార్యకర్తల కంటే ఎక్కువగా కష్టపడి ప్రచారం చేసిన నిరుద్యోగులు.. అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లు గడుస్తున్నా ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని విమర్శించారు. 2024లో కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తున్నట్లు ప్రచారం చేసి జీవో నంబర్ 31 విడుదల చేశారని కవిత తెలిపారు. వయోపరిమితిలో సడలింపు ఇస్తామని చెప్పి రెండేళ్లపాటు సమయం వృథా చేశారని ఆరోపించారు. దీంతో ఎంతోమంది నిరుద్యోగులు వయోపరిమితి దాటిపోయి ఉద్యోగాలకు అర్హత కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు సాధారణంగా సుమారు 9 లక్షల దరఖాస్తులు రావాల్సి ఉండగా.. వయోపరిమితి పెంచకపోవడంతో ఈసారి కేవలం 3 నుంచి 4 లక్షల దరఖాస్తులే వచ్చాయని కవిత పేర్కొన్నారు.

### ఎస్సైకి 38.. కానిస్టేబుల్‌కు 36 ఏళ్లు

ఎస్సై ఉద్యోగాలకు వయోపరిమితిని 38 సంవత్సరాలకు, కానిస్టేబుల్ ఉద్యోగాలకు 36 సంవత్సరాలకు పెంచాలని కవిత డిమాండ్ చేశారు. వయోపరిమితి పెంచితే మరో 2 నుంచి 3 లక్షల మంది నిరుద్యోగులకు అవకాశం లభిస్తుందని అన్నారు. రాష్ట్రంలో వాస్తవానికి 20 వేల కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అయితే ప్రభుత్వం కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చిందని ఆరోపించారు. హోంశాఖ ఒక ప్రకటన చేస్తే ప్రభుత్వం మరో ప్రకటన చేస్తోందని, ప్రభుత్వంలోనే సమన్వయం లేదని విమర్శించారు.

### అభ్యర్థులకు అండగా పోరాటం

వయోపరిమితి పెంచకపోవడంతో వేలాది మంది నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని కవిత అన్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి వెంటనే వయోపరిమితిని పెంచాలని డిమాండ్ చేశారు. వయోపరిమితి పెంపు కోసం పోరాడుతున్న కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు తెలంగాణ రక్షణ సేన పూర్తి మద్దతుగా ఉంటుందని కవిత స్పష్టం చేశారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు వారి తరపున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

# ఎమ్మెల్సీలు మధు, నవీన్‌లపై సస్పెన్షన్ వేటు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని శాసనసభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా సభ ఖండించింది. బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్‌కు పంపించారు. దీనిపై మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు మరో తీర్మానం ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటింగ్ అనంతరం ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. అయితే నాంపల్లి కోర్టు పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేయాలని ఆదేశిస్తూ.. ఒక్కొక్కరు రూ.10 వేల పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించిన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు. కోర్టు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు శాసనమండలికి హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే సస్పెన్షన్ తీర్మానం మండలి ముందుకు వచ్చింది. తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో ఆందోళన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని చేస్తూ బైఠాయించారు. ప్రభుత్వం తమ పార్టీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

# నా తల్లిని అన్నారు.. మీ తల్లిని కాదు

(మొదటి పేజీ తరువాయి)

నమోదు చేయడం దారుణమని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరును తప్పుబడుతూ సభను కౌరవ సభతో పోల్చారు. హరీశ్ రావ్ విమర్శలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర అసహనం, భావోద్వేగాన్ని వ్యక్తం చేశారు. అసెంబ్లీ నిబంధనల ప్రకారం మహిళా సభ్యుల పట్ల తనకు పూర్తి గౌరవం ఉందని, శాసనసభ్యుల వ్యాఖ్యలు సరికాదని హితవు పలికారు. వారు నా చెల్లెలు అని చెప్పారు. మీకు కాదు ఆవేశం ఉండాల్సింది, స్పీకర్ స్థానంలో ఉన్న నాకు ఉండాలి అని వ్యాఖ్యానించిన ఆయన, తన వద్దకు వచ్చి కొందరు చేసిన వ్యాఖ్యలు తనను తీవ్రంగా కలచివేశాయని పేర్కొన్నారు. నా తల్లిని మాటలు అన్నారని హరీశ్ రావుపై సీరియస్ అయ్యారు. సభలోని మహిళా సభ్యులంతా తనకు సోదరీమణులతో సమానమని, సభ వద్ద జరిగిన సంఘటనపై సమగ్ర నివేదిక రాగానే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, స్పీకర్‌ను బెదిరించే రీతిలో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని మండిపడ్డారు. సభా సంప్రదాయాలను విస్మరించి సభాపతి స్థానాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం తీవ్రమైన విషయమన్నారు. అసెంబ్లీ పరిసరాల్లో జరిగిన ప్రతి సంఘటన వీడియో రికార్డుల్లో భద్రంగా ఉందని, ప్రజలందరికీ నిజానిజాలు తెలుస్తాయని తెలిపారు. మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ తదితరులు కూడా బీఆర్ఎస్ నాయకులు స్పీకర్‌కు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య తీవ్రస్థాయిలో రాజకీయ యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ప్రాంగణంలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ప్రతిపక్ష నాయకులు, మహిళా ప్రజాప్రతినిధులను అసెంబ్లీ లోపలికి రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తుంటే, సభ నియమ నిబంధనలను ఉల్లంఘించి సభాపతిపై దాడికి దిగేలా మాట్లాడారని కాంగ్రెస్ విమర్శిస్తోంది.

# మహిళా నేతలపై దాడికి రేవంత్ సిగ్గుతో తలదించుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని కేటీఆర్ తెలిపారు. స్పీకర్ బాధపడి ఉంటే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని ఎమ్మెల్సీ ఇప్పటికే విచారం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. అసలు ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే స్పీకర్‌ను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు.

### కేసీఆర్ ఇంటిపైకి పోలీసు ఎస్కార్ట్‌తో గూండాలా?

కేసీఆర్ ఇంటిపైకి కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసు ఎస్కార్ట్‌తో పంపిన ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఏ స్థాయికి దిగజార్చిందో అర్థమవుతోందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ మరణాన్ని కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సాధన కోసం 14 ఏళ్ల పాటు ఉద్యమం చేసిన కేసీఆర్‌ను ఎందుకు చావాలని కోరుతున్నారని ప్రశ్నించారు. రైతుబంధు ద్వారా 70 లక్షల మంది రైతులకు అండగా నిలిచిన కేసీఆర్ ప్రభుత్వం.. కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్ల వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని గుర్తుచేశారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా అభివృద్ధి చేయడంతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతుల ఆకాంక్షలను నెరవేర్చామని పేర్కొన్నారు.

### 'కాంగ్రెస్ మేనిఫెస్టోనే అసలు టార్గెట్'

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. "420 హామీలు ఇచ్చి 100 రోజుల్లో అమలు చేస్తామన్నారు. మహిళలకు రూ.2,500, తులం బంగారం, రైతులకు రూ.15 వేల రైతుభరోసా, రైతు కూలీలు, కౌలు రైతులు, ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?" అని ప్రశ్నించారు. రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి రూ.4 వేలు, యువతకు స్కూటీలు వంటి హామీలపై తెలంగాణ యువత ప్రభుత్వాన్ని నిలదీస్తోందన్నారు. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు, పేదలు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయడం, బహిష్కరించడం ద్వారా వారి గొంతును నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇద్దరు ఎమ్మెల్సీలపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. అసలు టార్గెట్ కేసీఆర్ లేదా ఎమ్మెల్సీల పదవులు కాదని, కాంగ్రెస్ మేనిఫెస్టోలోని హామీల అమలేనని కేటీఆర్ అన్నారు.

### ఉద్యోగులు, రైతుల సమస్యలపై చర్చ ఏది?

ప్రభుత్వ ఉద్యోగులకు ఏడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఆరు నెలల్లో పీఆర్సీ ఇస్తామని చెప్పి మూడేళ్లు దాటినా అమలు చేయలేదని కేటీఆర్ విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీ వ్యవహారాల్లో తెలంగాణ నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు అవకాశం కల్పిస్తున్నారని విమర్శించారు. నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులకు వెంటనే నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయాలు మానుకుని రైతుల ప్రయోజనాల కోసం వినియోగించాలని కోరారు. కన్నెపల్లి పంపులు ఎప్పుడు ఆన్ చేస్తారో, కాళేశ్వరం నీళ్లు ఎప్పుడు వస్తాయో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

### ఫీజు బకాయిలపై చర్చకు డిమాండ్

కోటి ఎకరాలకు సంబంధించిన నిషేధిత జాబితా భూముల సమస్యతో పాటు విద్యార్థులకు సంబంధించిన రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై అసెంబ్లీలో చర్చ జరపాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా తమను అడ్డుకునేందుకు పోలీసులను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లోనే కాంగ్రెస్ కార్యకర్తలతో తమపై దాడి చేయించే ప్రయత్నం జరిగిందని, పోలీసుల ఆదేశాలను గౌరవిస్తూ ఉన్న తమపై పోలీస్‌స్టేషన్‌లోనే దౌర్జన్యానికి ప్రయత్నించారని కేటీఆర్ ఆరోపించారు. రాజ్యాంగం, చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రభుత్వానికి గౌరవం లేదని విమర్శించారు.

### మిగిలిన 823 రోజులూ పోరాటమే

రేవంత్‌రెడ్డి నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజాస్వామ్యం, న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. మహిళా నాయకురాళ్లపై జరిగిన అవమానానికి ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పే వరకు పోరాటం కొనసాగుతుందని అన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా 823 రోజుల పాలన ఉంది. ఈ కాలంలో ప్రజల తరపున ప్రభుత్వాన్ని వదిలిపెట్టం. వైఫల్యాన్ని ఎండగడతాం" అన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు కట్టిపెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

పార్టీల నేతలు ఉపయోగిస్తున్న భాషను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారాలు చూపాల్సిన శాసనసభను రాజకీయాలకు వేదికగా మార్చుకోవద్దని హితవు పలికారు. స్పీకర్‌ను బీఆర్ఎస్ నేతలు అసభ్య పదజాలంతో దూషించడం ప్రజాస్వామ్యవాదులెవరూ జీర్ణించుకోలేరని బండి సంజయ్ అన్నారు. తాతా మధుతో పాటు విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై చేయి చేసుకున్న బీఆర్ఎస్ నేతలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన బీజేపీ కార్యకర్తలపై పోలీసులు అనుచితంగా వ్యవహరించడం, లాఠీఛార్జి చేయడం కూడా తప్పేనని పేర్కొన్నారు.

### ప్రజా సమస్యలపై చర్చ ఎక్కడ?

అసెంబ్లీలో వరుసగా రెండ్రోజులు ఒకే అంశంపై చర్చిస్తూ విలువైన సభా సమయాన్ని వృథా చేయడం దుర్మార్గమని బండి సంజయ్ విమర్శించారు. "ప్రజా సమస్యలను పూర్తిగా పక్కనపెట్టి రాజకీయ డ్రామాలు చేయడం ఆపాలి" అని అన్నారు. రాష్ట్రంలో 22ఏ భూముల సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికార పార్టీ నేతల భూ వ్యవహారాలపై ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాక లక్షలాది మంది విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. సాగునీరు అందక దక్షిణ తెలంగాణ రైతాంగం ఆందోళనలో ఉందని, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఐటీ సంస్థలు, పరిశ్రమలు మూతపడుతున్నాయని ఆరోపించారు. డీఏలు, పదవీ విరమణ ప్రయోజనాలు, పెండింగ్ బిల్లులు అందక ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, సొంత ఇల్లు లేక, అద్దెలు చెల్లించలేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని బండి సంజయ్ అన్నారు. పారిశుధ్య లోపాలు, దోమలు, వ్యాధులతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారని, నిత్యావసర ధరల పెరుగుదలతో సామాన్యులు గోస పడుతున్నారని పేర్కొన్నారు.

### 'దొందూ దొందే'

కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నట్లు కనిపిస్తూ లోపల మాత్రం రాజీ రాజకీయాలు చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. "నువ్వు కొట్టినట్లు చేయ్.. నేను ఏడ్చినట్లు చేస్తా" అన్న చందంగా రెండు పార్టీలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ప్రజలను దోచుకుంటున్నాయని, ప్రజా సమస్యలు కనీసం చర్చకు రాకుండా అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. రెండు పార్టీల డ్రామాలు, అవినీతి, దోపిడీని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే వారిని పోలీసులు అడ్డుకోవడం సరికాదని బండి సంజయ్ అన్నారు. అదే సమయంలో విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై బీఆర్ఎస్ నాయకులు దాడికి దిగడం, దూషించడం కూడా తప్పేనని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం శాంతియుతంగా నిరసన తెలిపిన బీజేపీ కార్యకర్తలపై పోలీసులు రక్తం కారేలా కొట్టారని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తలపై, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపే వారిపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదు?

ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉండే అర్హతను బీఆర్ఎస్ ఎప్పుడో కోల్పోయిందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి రాని కేసీఆర్‌కు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఎందుకని ప్రశ్నించారు. ఎర్రవల్లి ఫాంహౌస్‌పై దాడి, కేసీఆర్‌పై హత్యాయత్నం అంటూ బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. గతంలో కేసీఆర్ తనను బెదిరించిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. పోలీసుల ద్వారా భయభ్రాంతులకు గురిచేసే సంస్కృతిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రోత్సహించిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పద్ధతిని అనుసరిస్తోందని విమర్శించారు. కేసీఆర్ హాజరయ్యేలా ఎర్రవల్లిలోనైనా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ఆయన వ్యంగ్యంగా సూచించారు.

### బీజేపీ అధికారంలోకి వస్తుంది

తెలంగాణలో ఇక అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అసెంబ్లీలో బీజేపీ సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. "ఇకనైనా రాజకీయ డ్రామాలు కట్టిపెట్టి ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించండి. సమస్యలకు పరిష్కార మార్గాలు చూపండి" అని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు బండి సంజయ్ సూచించారు.

## మంత్రి పదవి అధిష్ఠానం నిర్ణయం: పీసీసీ చీఫ్

హైదరాబాద్: తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు చెప్పినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానన్నారు.

## కేసీఆర్ ఇంటిపై దాడికి పోలీసుల ఎస్కార్ట్ ఇచ్చారా?

- మమ్మల్ని అక్రమంగా అరెస్టు చేసి.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు పోలీసుల రక్షణా?
- ప్రజాస్వామ్యం ఉందా? రేవంత్ అప్రజాస్వామిక చర్యలను రాహుల్ సమర్థిస్తారా?: హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (వార్తా వేదిక సూర్య): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రక్షణగా వెళ్తున్న తమను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. హకీంపేట్ వద్ద తనతో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మేడ్చల్ సీపీ సుమతి ఆధ్వర్యంలో పోలీసులు నిర్బంధించి జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారని తెలిపారు. కేసీఆర్ ఇంటిపై దాడికి వెళ్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మాత్రం పోలీసుల ఎస్కార్ట్ కల్పిస్తున్నారని హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. "కేసీఆర్‌గారికి రక్షణగా వెళ్తున్న మమ్మల్ని అక్రమంగా అరెస్టు చేసి.. ఆయన ఇంటిపై దాడికి వెళ్తున్న కాంగ్రెస్ గుండాలకు, ఎమ్మెల్యేలకు పైలట్ ఎస్కార్ట్ ఇచ్చి పంపుతారా? అసలు ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా?" అని ప్రశ్నించారు.

### కేసీఆర్ ఇంటిపైకే దాడికి పంపుతున్నారు

తెలంగాణ సాధించిన నాయకుడు, పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఇంటిపైకి కాంగ్రెస్ ప్రభుత్వం దాడికి పంపుతోందని హరీశ్‌రావు ఆరోపించారు. నిన్న మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దురుసుగా వ్యవహరించారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. తాజాగా కేసీఆర్ ఇంటి వద్దకు కాంగ్రెస్ నేతలను పంపడం ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమన్నారు. స్వయంగా హోంశాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గరుండి ఈ చర్యలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.

### రాహుల్‌గాంధీ సమర్థిస్తారా?

రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి హరీశ్‌రావు సూటి ప్రశ్న సంధించారు. "మీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న ఈ అప్రజాస్వామిక చర్యలను, దాడులను మీరు సమర్థిస్తారా? ప్రజలకు ఇచ్చిన ఏడో గ్యారెంటీ ఇదేనా?" అని ప్రశ్నించారు. గతంలో అసోం ముఖ్యమంత్రి తనపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు కాంగ్రెస్ నేతలు స్పందించకపోయినా కేసీఆర్ మానవత్వంతో, నిజాయితీగా రాహుల్‌గాంధీకి అండగా నిలిచారని హరీశ్‌రావు గుర్తుచేశారు. అలాంటి కేసీఆర్ ఇంటిపైకే ఇప్పుడు కాంగ్రెస్ నేతలను పంపడం ఏ విధమైన రాజకీయమని నిలదీశారు. కేసీఆర్ ప్రాణాలను సైతం పణంగా పెట్టి తెలంగాణ కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించారని హరీశ్‌రావు అన్నారు. "కేసీఆర్ తెలంగాణ సాధించకపోతే ఈరోజు రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రి పదవి ఎక్కడిది?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్ బహిరంగంగా కేసీఆర్ చావును కోరుకున్నారంటూ హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ వ్యాఖ్యలు కేవలం శంకర్‌వి మాత్రమే కావని, రేవంత్‌రెడ్డి వైఖరికి ప్రతిబింబమని విమర్శించారు. కేసీఆర్‌ను ప్రతిరోజూ తిట్టిస్తూ, ఆయనపై దాడులకు కాంగ్రెస్ నేతలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.

### దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

పోలీసుల రక్షణలో కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు కేసీఆర్ ఇంటిపై దాడికి వెళ్లడం తెలంగాణ సమాజం, బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నాయని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని, ప్రతిపక్ష హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రేవంత్‌రెడ్డి చర్యలపై కాంగ్రెస్ అధిష్ఠానం స్పందించాలని, రాహుల్‌గాంధీ దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్‌ను సద్వినియోగం చేసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

కలిసి మంత్రి ఛాలెంజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లఘుచిత్రాలు, పాటలు, వీడియోల ద్వారా యువత తమ సృజనాత్మకతను ప్రదర్శించేందుకు ఈ కార్యక్రమం చక్కటి వేదికగా నిలుస్తుందని అన్నారు. బతుకమ్మ విశిష్టతతో పాటు తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కూడా సృజనాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఛాలెంజ్ ఉపయోగపడుతుందని మంత్రి పేర్కొన్నారు. యువ ఫిలిం మేకర్స్, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్–2026'ను విజయవంతం చేయాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు.

## ప్రత్యేక ప్రాంతాలుగా అరుణాచల్, అక్సాయ్‌చిన్

న్యూఢిల్లీ: ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన కొత్త ప్రపంచ పటం మరోసారి చర్చనీయాంశంగా మారింది. 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానానికి భారత్ మద్దతు తెలిపిన నేపథ్యంలో వెలువడిన ఈ మ్యాప్‌లో అరుణాచల్‌ప్రదేశ్, అక్సాయ్‌చిన్‌లను భారత్, చైనా వాదిస్తున్న సరిహద్దుల మధ్య ప్రత్యేక ప్రాంతాలుగా చూపించారు. అక్సాయ్‌చిన్‌ను లడఖ్‌లో భాగంగా భారత్ పేర్కొంటున్న విషయం తెలిసిందే. ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానంపై చర్చలు జరుగుతున్న సమయంలో జులై 1న ఈ మ్యాప్‌ను తొలిసారి విడుదల చేశారు. ఇందులో అరుణాచల్‌ప్రదేశ్‌కు నాగాలాండ్‌తో ఉన్న సరిహద్దును తొలగించారు. అరుణాచల్‌ప్రదేశ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా చూపిస్తూ.. పశ్చిమాన అసోం, ఉత్తరాన చైనా సరిహద్దుగా ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. అదే విధంగా అక్సాయ్‌చిన్‌ను కూడా ప్రత్యేక ప్రాంతంగా చూపించారు. దాని పశ్చిమ వైపు భారత్, తూర్పు వైపు చైనా సరిహద్దులు ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. ఈ మార్పులు ఎందుకు చేశారన్న దానిపై ఐరాస ఎలాంటి వివరణ ఇవ్వలేదు. జమ్మూ కశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉన్న నియంత్రణ రేఖ (ఎల్ఓసీ)ని కూడా మ్యాప్‌లో చుక్కల రేఖతో చూపించారు. దీనిపై మ్యాప్ కింది భాగంలో ఐరాస వివరణ ఇచ్చింది. భారత్, పాకిస్థాన్ అంగీకరించిన జమ్మూ కశ్మీర్ ఎల్ఓసీని ఈ చుక్కల రేఖ సుమారుగా సూచిస్తుందని పేర్కొంది. జమ్మూ కశ్మీర్ తుది స్థితిపై సంబంధిత పక్షాల మధ్య ఇంకా అంగీకారం కుదరలేదని తెలిపింది. ప్రపంచంలోని ప్రాంతాలను పటాల్లో మరింత కచ్చితంగా, సమానత్వంతో చూపించాలంటూ ఆఫ్రికన్ యూనియన్ మద్దతుతో తీసుకొచ్చిన 'కరెక్ట్ ది మ్యాప' తీర్మానాన్ని ఐరాస సర్వసభ్య సమావేశం గత వారం ఆమోదించింది. ముఖ్యంగా ఆఫ్రికా ప్రాంతాల భౌగోళిక చిత్రణను మరింత సమానంగా చూపించడమే దీని లక్ష్యం.



రంగారెడ్డి

# ఎమ్మెల్సీ తాత మధును శాసనమండలి నుండి భర్తరఫ్ చేయాలి

### లి మంథని కాంగ్రెస్ పార్టీ నాయకులు



**మంథని, సెప్టెంబర్ -08( వార్త వేదిక సూర్య దినపత్రిక ):**
ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు ఆదేశాల మేరకు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాన రోడ్డుపై బైఠాయించి డప్పులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుదుదుల వెంకన్న, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మంథని రాకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జనగామ నర్సింగరావు, గ్రామ శాఖ అధ్యక్షులు చంద్రు రాజమల్లు, మాట్లాడుతూ....

వర్షాకాలం తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుండి ప్రారంభం కాగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అతడిని వెంటనే శాసనమండలి నుండి తొలగించాలని అన్నారు.

అసెంబ్లీ వద్ద బిఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు చేసిన హంగామా అంతా ఇంతా కాదని వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ను విమర్శించడం అలవాటైపోయింది అని కేసీఆర్ ఆదివారం బిఆర్ఎస్ ఎల్పీ సమావేశం నిర్వహించి తమ పార్టీ శాసనసభ్యులకు స్పీకర్ ని దూషించమని దిశానిర్దేశం చేశారని ప్రశ్నించారు. బిఆర్ఎస్ చేస్తున్న అనైతిక చర్యలను ప్రజలందరూ గమనిస్తున్నారని వారికి మళ్ళీ తిరిగి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతారని తెలిపారు. స్పీకర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల చిత్తశుద్ధితో బాధ్యత వహించి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యల పట్ల నిండు అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కంటతడి పెట్టడం బాధాకరమని వ్యక్తం చేశారు. స్పీకర్ కు కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను,అభివృద్ధి కార్యక్రమాలను చూసి బిఆర్ఎస్ పార్టీ వారు ఓర్చుకోలేకపోతున్నామని వారి ఉనికిని చాటుకునేందుకు రోడ్ల మీదకు వచ్చి ఏవో ఆందోళన కార్యక్రమాలను చేస్తామంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత స్పీకర్పై అసభ్య పదజాలం బీఆర్ఎస్ నేతల దురహంకారానికి పరాకాష్ట అని అన్నారు.

ఎమ్మెల్సీ తాతా మధు ఒక దళిత స్పీకర్ను ఉద్దేశిం చి తీవ్రమైన పదజాలం ఉప యోగించడం అత్యంత అభ్య ంతరకరం, ఇది కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కా దు, దళిత స్పీకర్ మనోభా వాలను దెబ్బతీసేలా వ్యవహ రించిన తీరుగా తెలంగాణ స మాజం చూస్తోందని తెలిపారు.

సభలో మాట్లాడటానికి దమ్ము లేక ప్రజల సమస్య లపై మాట్లాడే ధైర్యం లేక త మ నాయకుడు అసెంబ్లీకి రాకపోవ డంపై సమాధానం చెప్పలేక విషయాన్ని పక్కదారి పట్టించేం దుకు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అడ్డమైన పిచ్చివేషాలు తెలంగాణ ప్రజలకు స్పష్టంగా కనిపిస్తు న్నాయని అన్నారు. రాజకీయ భేదాలు ఉండొచ్చు, విమర్శలు,(ప్రతివిమర్శలు చేసుకోవచ్చు కానీ స్పీకర్ పదవి కి, వ్యక్తిగత గౌరవానికి, దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే స్థాయిలో అసభ్య పదజాలం ఉపయోగించడం ఏమాత్రం సమర్థనీయం కాదు అని ఈ దురహం కారాన్ని తెలంగాణ సమాజం ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,సర్పంచ్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల నాయకులు, మహిళ నాయకులు పాల్గొన్నారు.

## పుష్టి ఫుడ్ బిస్కెట్ కంపెనీ సమీపంలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :**



కాటేదాన్ ప్రాంతంలోని పుష్టి ఫుడ్ బిస్కెట్ కంపెనీ సమీపంలో రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని బీజేపీ నాయకులు అడికే రాజు డిమాండ్ చేశారు. రోడ్డుకు అతి సమీపంలో, ప్రమాదకర స్థితిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపై కాటేదాన్ ఏఈతో పాటు విద్యుత్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకుండా వదిలేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల అటుగా రాకపోకలు సాగించే కార్మికులతో పాటు మూగజీవులకు కూడా ప్రమాదం పొంచి ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను పైకి లేపి, తగిన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కాటేదాన్ ప్రాంతంలో ఇలాంటి ప్రమాదకరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ఇంకా చాలా ఉన్నాయని, వాటిని గుర్తించి వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని అడికే రాజు డిమాండ్ చేశారు.

## గండిపేట మండలంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆకస్మిక తనిఖీ

### - పాఠశాలల్లో ప్రాథమిక విద్యా సామర్థ్యాల పరిశీలన

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :**




రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. వెంకటేశ్వర్లు మంగళవారం ఉదయం గండిపేట మండలంలో ఆకస్మికంగా పర్యటించి పలు ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బండ్లగూడ ఉన్నత ప్రాథమిక పాఠశాల, హిమాయత్‌సాగర్ ఉన్నత ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యా కార్యకలాపాలను పరిశీలించారు. ముఖ్యంగా విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞాన సామర్థ్యాల అభివృద్ధి కార్యక్రమం అమలు తీరును సమీక్షించారు. పాఠశాలల్లోని సంబంధిత రికార్డులను పరిశీలించడంతో పాటు తరగతి గదుల్లో బోధనా విధానాన్ని స్వయంగా గమనించారు. విద్యార్థుల అభ్యసన స్థాయి, పాఠ్య పుస్తకాలు, అభ్యాస పుస్తకాలు, నోటు పుస్తకాలను పరిశీలించారు.బండ్లగూడ పాఠశాలలో విద్యార్థులతో నేరుగా మాట్లాడిన జిల్లా విద్యాశాఖాధికారి వారి చదవడం, రాయడం, సంఖ్యలను గుర్తించడం వంటి ప్రాథమిక విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం హిమాయత్‌సాగర్ పాఠశాలలోనూ విద్యార్థులతో మమేకమై వారి అభ్యసన స్థాయిని పరిశీలించారు.విద్యార్థులు చదవడం, రాయడం, సంఖ్యా పరిజ్ఞానం వంటి ప్రాథమిక నైపుణ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సూచించారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు తరగతి గది బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ఈ తనిఖీలో గండిపేట మండల విద్యాశాఖాధికారి, క్లస్టర్ వనరుల వ్యక్తులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేపాల్ వరదల్లో గల్లంతైన మణికొండ వాసి ధన్పాల్ రెడ్డి

### - బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :**
నేపాల్‌లో సంభవించిన వరదల్లో మణికొండకు చెందిన ధన్పాల్ రెడ్డి గల్లంతవడంతో ఆయన కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. రీఛా టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా నేపాల్ యాత్రకు వెళ్లిన ధన్పాల్ రెడ్డి వరద ప్రమాదం అనంతరం కనిపించకుండా పోయారు. ప్రమాదం జరిగి రోజులు గడుస్తున్నా ఆయన ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మణికొండలోని ధన్పాల్ రెడ్డి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ధన్పాల్ రెడ్డి ఆచూకీ కోసం ప్రభుత్వం తరఫున అన్ని విధాలా చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ, నేపాల్ అధికారులతో సమన్వయం చేసి గాలింపు చర్యలను వేగవంతం చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంట గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ చైర్మన్ వేణు గౌడ్, మణికొండ సర్కిల్ పార్టీ అధ్యక్షుడు శ్రీరామ్, కుమార్, శ్రవణ్ తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు - మంద జగన్

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 08(వార్త వేదిక సూర్య)**
మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా మంగళవారం మెట్టుగూడ అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రత్యేక నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరుగుతోందని, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు సరైన పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రజా సమస్యలపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించేందుకు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం బిజెపి ఎమ్మెల్యే పాయిలి శంకర్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై చేస్తున్న అనుచర వ్యాఖ్యలను ఖండిస్తూ వారసిగూడ సిఐ రాజేందర్ గౌడ్ కు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కంది శైలజ, డాక్టర్ హేమ సామల, కంది నారాయణ, వనమల భాస్కర్, చింతకింది మల్లేష్, బెజ్జంకి రాజేష్, శైలేందర్, పాక సాయి, మర్పల్లి రవి, శ్రీనివాస్ గౌడ్, ఉండింటి సచిన్, వేణు గోపాల్ రెడ్డి, తుంగ లక్ష్మణ్, అమర్, బాన్సువాడు సాల్వర్, మహేందర్, నక్క మధు, జింకల మల్లేష్, ఎండి కాజా భాయ్, సునీల్, శీలం సాయి యాదవ్, గుమ్మడవెల్లి మధుకర్, యాదగిరి, శివ, ఒంజరి వెంకటేష్, వనమల అనిల్, గంగాపురం ఆంజనేయులు గౌడ్, సుమలత, సుజాత, గీత, మానస, మంజు, రేణుక ఫరీదా, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.







## సిద్దులగుట్ట జాతరలో తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :**
రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శంషాబాద్ వెండికొండ సిద్ధేశ్వర సిద్దులగుట్ట స్వామివారి జాతర చివరి రోజు తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు, భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసిన కమిటీ సభ్యులను అభినందించారు.భగవంతుని ఆశీర్వాదాలు ప్రజలందరిపై ఉండాలని, దేశం సస్యశ్యామలంగా ఉండాలని, ఎలాంటి విపత్తులు సంభవించకుండా ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపాలిటీ, మండలానికి చెందిన బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు నందీశ్వర్ పంతులు, బతుకు శ్రీనివాస్ యాదవ్, జగ్జీవన్ రెడ్డి, కమలమ్మ, వీరేందర్ రెడ్డి, ధన్పాల్ రెడ్డి, బండి శ్రీకాంత్ యాదవ్, నర్సింగ్ ముదిరాజ్, హర్షిత్ రెడ్డి, సిద్దు ముదిరాజ్, శివారెడ్డి, గిరి, శ్రీకాంత్, ప్రేమ్ కుమార్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ మండలంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

### నేడు దుర్గ కన్వెన్షన్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 09 ( వార్త వేదిక సూర్య ) :**
రాజేంద్రనగర్ మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఉపాధ్యాయుల అంకితభావం, సేవలు, విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించనున్నారు. సెప్టెంబర్ 9న మధ్యాహ్నం 12.30 గంటలకు భోజనం అనంతరం మధ్యాహ్నం 1 గంటకు దుర్గానగర్‌లోని దుర్గ కన్వెన్షన్‌లో కార్యక్రమం ప్రారంభం కానుంది. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టీ. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేయనున్నారు. కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కార్యాలయం, 9న బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు భోజనం అనంతరం మధ్యాహ్నం 1 గంటకు దుర్గానగర్‌లోని దుగ కన్వెన్షన్‌లో కార్యక్రమం ప్రారంభం కానుంది. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టీ. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేయనున్నారు.పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలు : మైలర్‌దేవ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సీమ చంద్రకళ, డి. బాలకృష్ణ; శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జె. శ్రీదేవి, బి.ఎస్. వరప్రసాద్; పద్మశాలిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన షబ్బీర్ అహ్మద్; బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏ. అశోక్ కుమార్; రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన డి. పద్మ, ఐ. నవనీత, కె. శారద ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

అలాగే లక్ష్మీగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన వై. రామయ్య, రాజేంద్రనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన జి. దీపిక, శ్రీరామ్‌నగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన జి. లత, గగన్‌పహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఎం. రేణుక, శివరాంపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన కృష్ణవేణి, వాంబే కాలనీ ప్రాథమిక పాఠశాలకు చెందిన పి. తిరుపతయ్య, హైదర్‌గూడ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్. భాస్కర్, అత్తాపూర్ హెచ్‌డబ్ల్యూ ప్రాథమిక పాఠశాలకు చెందిన సి.ఎస్. లావణ్య, ఉప్పర్‌పల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన కె. శిరీష, ప్రేమావతిపేట్ ప్రాథమిక పాఠశాలకు చెందిన మునీరా బేగం, ఎన్‌టీఆర్ నగర్ యూఎం ప్రాథమిక పాఠశాలకు చెందిన షైనాజ్ ఉన్నిసా, హసన్‌నగర్-6 యూఎం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన అస్మా అంజుమ్‌లను కూడా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక చేశారు. చింతల్‌మెట్ బాలికల తెలంగాణ గురుకుల పాఠశాలకు చెందిన డాక్టర్ ఎం. రాములమ్మ, రాజేంద్రనగర్ బాలుర తెలంగాణ గురుకుల పాఠశాలకు చెందిన కృష్ణమ్మ, రాజేంద్రనగర్ బాలికల మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన రామకృష్ణారెడ్డి తదితరులు కూడా పురస్కార గ్రహీతల జాబితాలో ఉన్నారు. విద్యార్థులకు విజ్ఞానాన్ని అందిస్తూ, వారి భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలుస్తున్న ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించనున్నారు.

## అర్హులైన బీసీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేత

### మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్

**మంథని, సెప్టెంబర్ -08 ( వార్త వేదిక సూర్య):**




తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న “ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం” ద్వారా అర్హులైన వెనుకబడిన తరగతులకు (బీసీ) చెందిన మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీతో అందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్/చైర్మన్ (బీసీడీడీ ) కోయ శ్రీ హర్ష 2026, సెప్టెంబర్ - 02 న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పథకం ద్వారా పేద, నిరుద్యోగ మరియు అర్హత కలిగిన బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడంతో పాటు వారి ఆర్థిక స్వావలంబనను పెంపొందించడం, ఆదాయ అవకాశాలను విస్తరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. అర్హత కలిగిన మహిళలు 2026, ావజ్ోవఎఎవతీ 15 తేది లోపు ౧+ూదీవీమీ వెబ్ దరఖాస్తు చేసుకొని మున్సిపల్ కార్యాలయం నందు దరఖాస్తులు అందజేయ గలరని కోరుచున్నాము. దరఖాస్తుదారులు బీసీ వర్గానికి చెందినవారై, 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక కుటుంబ ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకూడదు. కుటుంబానికి ఒక్క కుట్టు మిషన్ యూనిట్ మాత్రమే మంజూరు చేస్తారు, తెల్ల రేషన్ కార్డు/ఆహార భద్రత కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రం, టైలరింగ్ నైపుణ్య ధ్రువీకరణ వంటి పత్రాలను పరిశీలించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై వ్యాపారస్తులకు అవగాహన సదస్సు

### పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

### మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్

**మంథని, సెప్టెంబర్ -08 ( వార్త వేదిక సూర్య ):**
మంథని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై పట్టణంలోని వ్యాపారస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి కలిగే నష్టాలను వ్యాపారులకు వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణ హితమైన వస్తువులను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి , పాలకవర్గ సభ్యులు పెంటరి రాజు, ఎల్లంకి వంశీధర్ , మున్సిపల్ సిబ్బంది, పట్టణ వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాజ్యాధికార పార్టీ లో చేరిన టిఇపిఏ వ్యవస్థాపకులు ధార మధు

**మంథని,సెప్టెంబర్ -08, (వార్త వేదిక సూర్య):**
తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్‌పి)లో తెలంగాణ ఎడ్యుకేషనల్ పేరెంట్స్ అసోసియేషన్ (టిఇపిఏ) వ్యవస్థాపకులు ధార మధు చేరారు. సోమవారం హైదరాబాద్‌లో టిఆర్‌పి వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ధార మధు పార్టీలో చేరడంతో విద్యా రంగంలో టిఆర్‌పి మరింత బలోపేతం అవుతుందని పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యారంగ సమస్యలపై ధార మధు చేస్తున్న కృషి పార్టీకి మరింత ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధార మధుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మెరుగు చందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వార్త వేదిక సూర్య VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 112
బుధవారం
09 సెప్టెంబర్ 2026



## డివిజన్ సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌కు వినతి

### మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక

సికింద్రాబాద్, సెప్టెంబర్ 08(వార్త వేదిక సూర్య)

డివిజన్ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరుతూ మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి కు మంగళవారం మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక మర్యాద పూర్వకంగా కలసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కొంతం దీపిక మాట్లాడుతూ..డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కమిషనర్ గారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. దెబ్బతిన్న రహదారుల స్థానంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి త్వరితగతిన అనుమతులు మంజూరు చేసి పనులు చేపట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అలాగే, డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడం వల్ల రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు మరియు పాదచారుల భద్రత దృష్ట్యా పనిచేయని స్ట్రీట్ లైట్లను వెంటనే మరమ్మతు చేసి, అవసరమైన ప్రాంతాల్లో నూతన వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు

## ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి పై జరిగిన దాడిని ఖండించిన దావద్ గూడ ఉప సర్పంచ్ తేజ నాయక్

మహేశ్వరం: సెప్టెంబర్ 8 వార్త వేదిక సూర్య



నిన్న తెలంగాణ అసెంబ్లీ వద్ద మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ మహేశ్వర ంలో మహాధర్నా నిర్వహించడం జరిగింది.

ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులతో గౌరవంగా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, పోలీసు అధికారులకు ఉందని, నిన్నటి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఈ మహాధర్నాలో డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా దావూద్ గూడ ఉప సర్పంచ్ ఆర్. తేజ నాయక్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య హక్కులను మహిళా ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడాలన్నారు. సబితమ్మకు జరిగిన అవమానం తెలంగాణ మహిళా సమాజానికి జరిగిన అవమానమే నని అన్నారు. మహిళా ప్రజాప్రతినిధులను గౌరవించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. ఆర్. తేజనాయక్, దావద్ గూడా ఉప సర్పంచ్

## మహేశ్వరం రైతులకు శుభవార్త

### అందుబాటులో సంచార పశు వైద్యశాల 1962 అంబులెన్స్

### టోల్ ఫ్రీ నంబర్ 1962 కు కాల్ చేస్తే చాలు..

### పశువుల వద్దకే వచ్చి ఉచిత వైద్యం

మహేశ్వరం సెప్టెంబర్ 8 వార్త వేదిక సూర్య



మహేశ్వరం నియోజకవర్గం లోని పశు రైతులు సంచార పశు వైద్యశాల అంబులెన్స్ 1962 సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంచార పశు వైద్యశాల వెటర్నరీ డాక్టర్ అఖిల సూచించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో పశువులకు వైద్య చికిత్స అవసరమైనప్పుడు రైతులు 1962 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేస్తే చాలు, అంబులెన్స్ నేరుగా పశువు వద్దకే వచ్చి ఉచితంగా వైద్యం అందిస్తుందని తెలిపారు. పశువులకు అవసరమైన మందులను కూడా ఉచితంగానే అందజేస్తామన్నారు.

ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో పశువులకు వివిధ రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, కాబట్టి రైతులు పశువులను పొడి ప్రాంతాలలో, పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచాలని సూచించారు. పశువుల పాకలను శుభ్రంగా ఉంచుకోవడం, దోమల నివారణ చర్యలు తీసుకోవడం, తాగునీటిని పరిశుభ్రంగా ఉంచడం వంటి జాగ్రత్తలు పాటించాలన్నారు.

పశువులకు జ్వరం, విరేచనాలు, నోరు-కాళ్ల వ్యాధి, గొంతు వాపు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే 1962 నంబర్ కు సమాచారం ఇవ్వాలని, ఆలస్యం చేయకుండా వైద్య సేవలు పొందాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఈ ఉచిత పశు వైద్య సేవలను ప్రతి రైతు వినియోగించుకుని తమ పశుసంపదను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

## దివ్యాంగునికి కృత్రిమ కాలు అందజేత




కూకట్‌పల్లి, సెప్టెంబర్ 08 (వార్త వేదిక సూర్య) :

ప్రమాదంలో కుడికాలు కోల్పోయి గత ఐదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగుడు తిరుమాల్‌కు తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ చొరవతో కృత్రిమ కాలు అందజేశారు. గుంటూరుకు చెందిన తిరుమల్ విధి నిర్వహణలో జరిగిన ప్రమాదంలో కుడికాలు కోల్పోయారు. అప్పటి నుంచి రోజువారీ పనులు చేసుకోవడానికే తీవ్ర ఇబ్బందులు పడుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ విషయాన్ని నరేష్, మెరుగు శివకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. తిరుమల్ పరిస్థితిని తెలుసుకున్న శివకృష్ణ వెంటనే స్పందించి, అవసరమైన సహాయం అందించేందుకు భారత్ వికాస్ పరిషత్ వికలాంగుల పునరావాస కేంద్రం ట్రస్ట్‌ను సంప్రదించారు.

వారి సహకారంతో తిరుమాల్‌కు కృత్రిమ కుడికాలు (ఆర్టిఫిషియల్ రైట్ లెగ్) అందేలా చర్యలు చేపట్టారు. మంగళవారం కృత్రిమ కాలును అమర్చడంతో తిరుమాల్‌లో కొత్త ఆశలు చిగురించాయి. ఇకపై రోజువారీ పనులను మరింత సులభంగా చేసుకునే అవకాశం లభించడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంకీ సహకారం చేసినవారు భారత్ వికాస్ ట్రస్ట్ మేనేజర్ నరేంద్ర, టెక్నీషియన్లు రఘు, మధు, స్వామి, చింతల విజయ్ కుమార్, రఘువరన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెరుగు శివకృష్ణ మాట్లాడుతూ.. సమాజంలో ఇంకా అనేక మంది దివ్యాంగులు సహాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.

దాతలు ముందుకు వచ్చి పేద కుటుంబాలకు చెందిన దివ్యాంగులకు విద్య, ఉపాధి, వైద్యం, వివాహం వంటి అంశాల్లో ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అవసరంలో ఉన్న ప్రతి దివ్యాంగుడికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన భారత్ వికాస్ ట్రస్ట్‌కు దివ్యాంగుల తరఫున మెరుగు శివకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గణేష్ మండపాల వద్ద భద్రతే తొలి ప్రాధాన్యం

### నిర్వాహకులకు కందుకూరు పోలీసుల కీలక సూచనలు

### నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు - 250 మంది ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహన సదస్సు

మహేశ్వరం సెప్టెంబర్ 8 వార్త వేదిక సూర్య




మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలో వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మహేశ్వరం ఏసీపీ జానకి రెడ్డి సూచించారు. కందుకూరు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం గణేష్ ఉత్సవాల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, వాలంటీర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఏసీపీ జానకి రెడ్డి మాట్లాడుతూ.. "భక్తి, భద్రత, బాధ్యత మూడు కలిసినప్పుడే ఉత్సవాలకు సార్థకత. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారితీస్తుంది. మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు ప్రతి అంశంలో ముందస్తు ప్రణాళికతో, పోలీసు శాఖతో సమన్వయంతో వ్యవహరించాలి" అని సూచించారు. కందుకూరు ఇన్‌స్పెక్టర్ హెచ్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను సహించబోమని హెచ్చరించారు.

**పోలీసులు ఇచ్చిన ప్రధాన సూచనలు:**

– ప్రధాన రహదారులు, ఆసుపత్రుల మార్గాలకు అడ్డంకి లేకుండా, అనుమతులు తీసుకున్న తర్వాతే మండపాల ఏర్పాటు

– విద్యుత్ భద్రతపై నిర్లక్ష్యం వద్దు, అనధికారిక కనెక్షన్లు తీసుకోరాదు, నాణ్యమైన వైర్లు, ఎంసీబీ తప్పనిసరి

– మండపాల వద్ద నీటి డ్రమ్ములు, ఇసుక బస్తాలు, అగ్నిమాపక పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలి

– రద్దీ నియంత్రణకు గుర్తింపు కార్డులతో వాలంటీర్లు, సీసీ కెమెరాల ఏర్పాటు

– లౌడ్ స్పీకర్లు నిర్దేశిత సమయం, శబ్ద పరిమితికి లోబడే వినియోగించాలి, రెచ్చగొట్టే పాటలు నిషేధం

– ట్రాఫిక్ కు అంతరాయం కలిగించవద్దు, అంబులెన్స్, ఫైర్ ఇంజన్లకు దారి వదలాలి

– బలవంతపు విరాళాల సేకరణ, మద్యం సేవించి గొడవలు నిషేధం

– సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, వదంతులు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

– పర్యావరణ హిత మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలి

ఈ కార్యక్రమంలో కందుకూరు ఎస్ఐ వి. చందర్ సింగ్, ఏఈ వేణుగోపాల్ విద్యుత్, ట్రాఫిక్, నిమజ్జన భద్రతపై అవగాహన కల్పించారు.

## హైదరాబాద్ తైకా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో

# పాల్వంచ విద్యార్థుల పతకాల పంట

పాల్వంచ,సెప్టెంబర్ -08, (వార్త వేదిక సూర్య): (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)

హైదరాబాద్‌లో ఈ నెల 6 తేదీ నా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తైకా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన ఎక్స్‌ట్రీమ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. జాతీయ స్థాయి క్రీడాకారులు పోటీపడిన ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్వంచ విద్యార్థులు తమ మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలతో సరికొత్త రికార్డులు సృష్టించారు.విజేతల వివరాలు:హర్షిక: బ్లాక్ బెల్ట్ గ్రాండ్ ఛాంపియన్‌షిప్ విభాగంలో అమోఘమైన ప్రదర్శనతో 'గ్రాండ్ ఛాంపియన్' టైటిల్‌ను కైవసం చేసుకుంది.దితిక శ్రీ: అసాధారణ ప్రతిభతో కటాస్ విభాగంలో గోల్డ్ మెడల్, ఫైట్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి డబుల్ గోల్డ్‌తో మెరిసింది.జెస్సీ: కటాస్ విభాగంలో సిల్వర్ మెడల్, ఫైట్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది.అర్జున్: ఫైట్ విభాగంలో గోల్డ్ మెడల్, కటాస్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సొంతం చేసుకున్నాడు.రిష్వన్ సింబా: కటాస్‌లో గోల్డ్ మెడల్, ఫైట్‌లో బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నాడు.అల్తాఫ్: కటాస్ విభాగంలో అద్భుత ప్రదర్శనతో గోల్డ్ మెడల్ సాధించాడు.హ్యారీ: కటాస్ మరియు ఫైట్ రెండు విభాగాల్లోనూ బ్రాంజ్ మెడల్స్ సాధించాడు.దేవాన్ష్: కటాస్ మరియు ఫైట్ విభాగాల్లో బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నాడు.మాస్టర్ కోనే సూరిబాబు హర్షం:ఈ ఘన విజయంపై ఎక్స్‌ట్రీమ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ



ముఖ్య శిక్షకులు (మాస్టర్) కోనే సూరిబాబు మాట్లాడుతూ.. "పాల్వంచ లాంటి ప్రాంతం నుండి వెళ్లిన విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో, కఠినమైన శిక్షణ పొంది హైదరాబాద్‌లో జరిగిన ఇంత పెద్ద ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించడం మా అకాడమీకే కాక, యావత్ జిల్లాకే గర్వకారణం" అని అన్నారు. భవిష్యత్తులో ఈ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణను అందిస్తామని ఆయన పేర్కొన్నారు.పాల్వంచ ప్రాంత కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటిన ఈ విజేతలను వారి తల్లిదండ్రులు, అకాడమీ మేనేజ్‌మెంట్, క్రీడాభిమానులు మరియు పట్టణ ప్రముఖులు ఘనంగా అభినందించారు.

## అరెస్టులతో అణచలేరు.. ఉద్యమాన్ని ఆపలేరు!

### బీఆర్ఎస్ నిరసనలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకింత భయం?

### - కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :



సోమవారం సోమవారం సబితమ్మ ఘటనకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన ధర్నా పిలుపుతో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర భయాందోళనకు గురవు తోందన్నారు. ధర్నాను అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ నివాసానికి పోలీసులు చేరుకోవడం తీవ్రంగా ఖండించారు. వెంకటేష్ ఇంట్లో లేరని కుటుంబ సభ్యులు స్పష్టంగా చెప్పినప్పటికీ పోలీసులు అక్కడే కాపు కాసి భయానక వాతావరణం సృష్టించారని ఆరోపించారు. ప్రజల తరపున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను పోలీసుల ద్వారా అణచివేయాలని చూడటం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికితనానికి నిదర్శన మని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం.. తమ వైఫ ల్యాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ గొంతును నొక్కాలని చూస్తోందని అన్నారు. ప్రజల తరపున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను పోలీసుల ద్వారా అణచి వేయాలని చూడటం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికితనానికి నిదర్శనమని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం.. తమ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ గొంతును నొక్కాలని చూస్తోందని ఆయన అన్నారు. అరెస్టులు, పోలీసుల ఒత్తిళ్లతో బీఆర్ఎస్ గొంతు నొక్కలేరని, ప్రజల కోసం పోరాటం ఆపేది లేదని ఆయన స్పష్టం చేశారు.









## అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన మాజీ కార్పొరేటర్ - కంది శైలజ

సికింద్రాబాద్, సెప్టెంబర్ 08(వార్త వేదిక సూర్య)

మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా మంగళవారం మెట్టుగూడ అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రత్యేక నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కంది శైలజ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరుగుతోందని, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు సరైన పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రజా సమస్యలపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించేందుకు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం బిజెపి ఎమ్మెల్యే పాయిలి శంకర్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై చేస్తున్న అనుచర వ్యాఖ్యలను ఖండిస్తూ వారసిగూడ సిఐ రాజేందర్ గౌడ్ కు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో కంది నారాయణ తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ వార్డ్ మెంబర్ మంద జగన్, వనమల భాస్కర్, చింతకింది మల్లేష్, బెజ్జంకి రాజేష్, శైలేందర్, పాక సాయి, మర్పల్లి రవి, శ్రీనివాస్ గౌడ్, ఉండింటి సచిన్, వేణు గోపాల్ రెడ్డి, తుంగ లక్ష్మణ్, అమర్, బాన్సువాడు సాల్వర్, మహేందర్, నక్క మధు, జింకల మల్లేష్, ఎండి కాజా భాయ్, సునీల్, శీలం సాయి యాదవ్, గుమ్మడవెల్లి మధుకర్, యాదగిరి, శివ, ఒంజరి వెంకటేష్, వనమల అనిల్, గంగాపురం ఆంజనేయులు గౌడ్, సుమలత, సుజాత, గీత, మానస, మంజు, రేణుక ఫరీదా, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చీకటి పడితే చాలు.. ఒంటరిగా వెళ్లేవారే టార్గెట్!

### ఎల్లమ్మబండలో దంపతులను అడ్డగించి దాడి.. మహిళ ఆభరణాలు లాక్కెళ్లిన ముగ్గురు అరెస్ట్.

### సుమారు 4 గ్రాముల బంగారు చెవిపోగులు, ప్లాటినం ఉంగరం స్వాధీనం.

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 08 (వార్త వేదిక సూర్య):




చీకటి పడిన తర్వాత ఒంటరిగా ప్రయాణించే వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. ఎల్లమ్మ బండలోని సిక్కు బస్తీ, గురు గోవింద్ సింగ్ కాలనీ సమీపంలో జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించి నిందితుల నుంచి బంగారు ఆభరణా లను స్వాధీనం చేసుకునా న్నరు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. సెప్టెంబర్ 6వ తేదీ రాత్రి సుమారు 7 గంటల సమయంలో ఓ మహిళతో పాటు మరో వ్యక్తి బైక్‌పై కూకట్‌పల్లి నుంచి జీడిమెట్లలోని తమ ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎల్లమ్మబండలోని సిక్కు బస్తీ, గురు గోవింద్ సింగ్ కాలనీ వద్దకు చేరుకోగానే ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు వారి బైక్‌ను అడ్డగించారు. అనంతరం వారిని బెదిరించి రహదారి పక్కనే ఉన్న ఏకాంత ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ ఇద్దరిపై దాడి చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరించిన నిందితులు.. మహిళ వద్ద ఉన్న బంగారు చెవిపోగులు, ప్లాటినం ఉంగరాన్ని బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై సెప్టెంబర్ 7వ తేదీ తెల్లవారుజామున 12.45 గంటలకు ఫిర్యాదు అందడంతో జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా ముగ్గురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

**అరెస్టయిన నిందితులు వీరే**

ఎ1. తిలిపిత్య దీపక్ సింగ్ (45) -- తారా సింగ్ కుమారుడు. వెల్డింగ్ పని చేస్తూ ఎల్లమ్మబండలోని గురు గోవింద్ సింగ్ కాలనీలో నివాసం.

ఎ2. బౌరీ రచన్ సింగ్ (25) -- బౌరీ జగ్జిత్ సింగ్ కుమారుడు. ఫ్యాబ్రికేషన్ పని చేస్తూ గురు గోవింద్ సింగ్ కాలనీలో నివాసం.

ఎ3. బురానీ సుర్జిత్ సింగ్ (25) -- దివంగత బురానీ జగన్ సింగ్ కుమారుడు. వెల్డింగ్ పని చేస్తూ గురు గోవింద్ సింగ్ కాలనీలో నివాసం. విచారణలో నిందితులు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో దోపిడీకి పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 8న ముగ్గురినీ అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం నిందితులకు న్యాయ రిమాండ్ విధిం చింది. పోలీసుల ప్రకారం, నిందితులు ప్రధానంగా సూర్యాస్తమయం తర్వాత చీకటి సమయంలో సిక్కు బస్తీ, ఎల్లమ్మబండ వైపు వెళ్లే మార్గాల్లో సంచరిస్తూ ఒంటరిగా ప్రయాణించే వ్యక్తులను లక్ష్యం గా చేసుకునేవారు. వారిని మార్గమధ్యంలో అడ్డగించి ఏకాంత ప్రాంతానికి తీసుకెళ్లి దాడి చేయడం, బెదిరించడం, బలవంతంగా నిర్బంధించడం, అనంతరం వారి వద్ద ఉన్న నగదు, ఆభరణాలను దోచుకోవడం నిందితుల విధానంగా పోలీసులు గుర్తించారు. నిందితుల్లో ఒకరికి గతంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రివేళ జరిగిన నేరానికి సంబంధించి గత నేరచరిత్ర ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి బాధితురాలికి చెందిన సుమారు 4 గ్రాముల బరువున్న ఒక జత బంగారు చెవిపోగులు, ఒక ప్లాటినం ఉంగరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**పోలీసు బృందానికి ఉన్నతాధికారుల అభినందనలు**

కుత్బుల్లాపూర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎన్. కోటిరెడ్డి, ఐపీఎస్, కుత్బుల్లాపూర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఏసీ బాలగంగి రెడ్డి మార్గదర్శకత్వంలో ఈ కేసును పోలీసులు ఛేదించారు. కేసు దర్యాప్తులో ఇన్‌స్పెక్టర్ ఎన్. సురేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పి. నరేంద్ర రెడ్డి, సబ్‌ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాస్ తో పాటు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ క్రైమ్ సిబ్బంది కీలకంగా వ్యవహరించారు. చీకటి వేళల్లో ఏకాంత మార్గాల్లో ప్రయాణించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.



# నాగర్‌కర్నూల్



## తెలంగాణ విమోచన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి: నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :

సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని తెలంగాణ విమోచన కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్, బూర నర్సయ్య గౌడ్‌తో కలిసి నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఉమ్మడి హైదరా బాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ విమోచన పోరాట చరిత్రను ప్రజలకు, ముఖ్యంగా యువతకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సెప్టెంబర్ 17ను ఘనంగా నిర్వహించ డంతో పాటు, ఈ నెల 15న జరిగే బైక్ ర్యాలీలో మహిళా కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ విమోచన పోరాట చరిత్రను భావితరాలకు చాటిచెప్పేందుకు బీజేపీ ఆధ్వర్యంలో విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది

### - ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుండ్లు

### మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

పెద్దపల్లి, సెప్టెంబర్ -08 ( వార్త వేదిక సూర్య ):



పెద్దపల్లి జిల్లా కేంద్రంలో భీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలన లో అమలు చేయని 420 హామీలు, 6 గ్యారంటీల పై బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని కి వినతి పత్రం అందజేసి మరియు మహిళా ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసుల తీరును ఖండిస్తూ నిరసన కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా భీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి, పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్ లతో కలిసి పాల్గొని అనంతరం అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని విమర్శించారు. ఆడబిడ్డల వివాహాల కోసం కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించారని అన్నారు. విద్యార్థుల పైచదువుల కోసం రూ.5 లక్షల ఏటీఎం కార్డులు ఇస్తామని చెప్పిన హామీని కూడా అమలు చేయలేదన్నారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి రాష్ట ప్రజలను, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను ఉపయోగించుకుని మోసం చేశారన్నారు. యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదని అన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలకు కొత్త పరిశ్రమలు తీసుకురావడంలో, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. పెద్దపల్లి పట్టణం మధ్యలో బస్సు డిపో నిర్మించడం వల్ల ప్రజలకు శబ్ద కాలుష్యంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, బస్సు డిపోను పట్టణానికి బయట ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బస్టాండ్ సమీపంలోని ప్రాంతాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని, అక్కడ ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు లేదా జిల్లా కోర్టు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశామని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, పింఛన్లను రూ. 1,000 నుంచి రూ. 2,000కు పెంచడం, రోడ్ల నిర్మాణం, చెరువుల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను చేపట్టామన్నారు, కాల్వశ్రీరాంపూర్‌లో సుమారు 950 ఇళ్ల నిర్మాణం, పెద్దపల్లిలో ఇళ్ల నిర్మాణంతో పాటు దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో అద్భుతమైన కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా బీఆర్ఎస్ నాయకులు వెనక్కి తగ్గబోరని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజల తరఫున, మహిళల తరఫున నిరంతరం పోరాడుతూనే ఉంటారని స్పష్టం చేశారు.

## ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శిగా పానుగంటి పర్వతాలు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :



ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు కరీంనగర్ పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ మహాసభల్లో రంగారెడ్డి జిల్లాకు చెందిన పానుగంటి పర్వతాలు ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 600 మంది ప్రతినిధులు మహాసభలకు హాజరయ్యారు. రాష్ట్ర నాయకత్వం, రంగారెడ్డి జిల్లా పార్టీ నాయకత్వం, ఏఐటీయూసీ జిల్లా నాయకత్వం అందించిన సహకారంతో తనను రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని పానుగంటి పర్వతాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్న నాయకత్వానికి, సహకరించిన పార్టీ నాయకులు, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు, ప్రతినిధు లందరికీ పానుగంటి పర్వతాలు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మరింత బాధ్యతతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

# గోదావరి పుష్కరాల పనులను సమన్వయంతో పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

### గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి, సెప్టెంబర్-08 వార్త వేదిక సూర్య):

గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్ల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, దేవాదాయ ఆలయాల అభివృద్ధి, భూసేకరణ, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, పార్కింగ్, కేశఖండనం, అన్నదానం తదితర అంశాలపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల కోసం ప్రధానంగా రోడ్ల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, దేవాదాయ ఆలయాల అభివృద్ధి పనులతో పాటు భక్తులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పుష్కరాల కోసం ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.25 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయని, టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పనులను సుమారు నాలుగు నెలల్లో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.

మంథని ఆలయాల సమూహ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో 15 అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. గౌతమేశ్వర, సురబాండేశ్వర, ఓంకారేశ్వర, మహాలక్ష్మి తదితర ఆలయాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటికే 10 పనులకు టెండర్లు ఖరారయ్యాయని, డిజైన్ ఆమోదాలు పూర్తయ్యాయని, అవసరమైన పత్రాల ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. కాబట్టి క్షేత్రస్థాయిలో పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.

శంకుస్థాపన కోసం పనులు నిలిపివేయాల్సిన అవసరం లేదని, శంకుస్థాపన కార్యక్రమం తరువాత నిర్వహించినప్పటికీ ముందుగా గ్రౌండ్ లెవల్ పనులను ప్రారంభించాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులు అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో చేపట్టాలని సూచించారు. పనుల సందర్భంగా రహదారులు, తాగునీటి పైప్‌లైన్లు, డ్రైనేజీలు దెబ్బతిన్నట్లయితే వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. అవసరమైన విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాల తొలగింపు వంటి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని తెలిపారు.

గోదావరి పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను ముందస్తుగా ఏర్పాటు చేయాలని అన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తలనీలాలు సమర్పించే అవకాశం ఉన్నందున కేశఖండనం కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అన్నదాన మండపాల ఏర్పాట్లను కూడా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

రోడ్ల అభివృద్ధి, ఆలయాల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం తదితర పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భూసేకరణకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే ప్రభుత్వానికి పంపినందున వాటిపై నిరంతరం ఫాలోఅప్ చేస్తూ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

సాధారణంగా భూసేకరణ ప్రక్రియకు సుమారు 90 రోజుల సమయం పడుతుందని, అయితే పుష్కరాలకు తక్కువ సమయం ఉన్నందున స్థానిక రైతులతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్నేహపూర్వకంగా చర్చించి వారి సహకారం తీసుకోవాలని తెలిపారు. అవసరమైన భూమిని త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పార్కింగ్ కోసం అవసరమైన భూమిని రైతుల నుంచి తాత్కాలికంగా లీజుకు తీసుకోవాలని, సంబంధిత రైతులకు ఒక సీజన్ కౌలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఘాట్ల నిర్మాణానికి అవసరమైన భూమిని వెంటనే సంబంధిత శాఖలకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఘాట్ల నిర్మాణానికి అవసరమైన భూమి ఇప్పటికే ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తయినందున స్థానిక రైతులతో సఖ్యతగా చర్చించి, ప్రజాప్రతినిధుల సహకారంతో భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూమికి సంబంధించిన చెల్లింపులు కూడా త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గోదావరిలో అవసరమైన నీటి లభ్యతకు సంబంధించి డీ-సిల్టింగ్ తదితర పనులను కూడా చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఘాట్ల నిర్మాణ పనులకు అవసరమైన చర్యలను ముందుగానే పూర్తి చేసి పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో ఏదైనా సమస్య కారణంగా పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవసరమైన డిజైన్ మార్పులకు సంబంధించిన ఆమోదాల కోసం సంబంధిత శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ అనుమతులను త్వరగా పొందాలని ఆదేశించారు. ఓదెల ఆలయ అభివృద్ధికి సంబంధించిన డిజైన్‌ను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

మంథని పట్టణంలోని

ఇతర అంతర్గత రోడ్ల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను కూడా సిద్ధం చేయాలని తెలిపారు. ఈ పనులను వచ్చే సంవత్సరం చేపట్టేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

ఘాట్ల నిర్మాణం పూర్తయిన అనంతరం జనవరి చివరి లేదా ఫిబ్రవరి నుంచి ఘాట్ల సుందరీకరణ పనులను ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. తాగునీరు, మున్సిపల్ పారిశుధ్య పనులకు మంజూరైన నిధులను సక్రమంగా వినియోగించేలా అవసరమైన పనులను ప్రతిపాదించి, త్వరగా చేపట్టాలని సూచించారు.

గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా అన్ని శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణతో పనిచేయాలని, ప్రజాప్రతినిధుల సహకారంతో పనులను వేగవంతంగా పూర్తి చేసి భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో మంథని ఆర్డీఓ సురేష్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ఏ.డి.సుప్రియ, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సబితా ఇంద్రారెడ్డి పై జరిగిన దాడిని ఖండించిన బిఆర్ఎస్ నాయకులు

మహేశ్వరం, సెప్టెంబర్ 08 వార్త వేదిక సూర్య

మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పై జరిగిన అనుచిత ఘటనకు నిరసనగా మహేశ్వరం మండల కేంద్రం అట్టుడికింది. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న మహిళా ప్రజాప్రతినిధి పట్ల ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు.

**నిరసనకారుల డిమాండ్లు:**

సబితా ఇంద్రారెడ్డి కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి అనుచితంగా ప్రవర్తించిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలి. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హైకోర్టు కఠినంగా వ్యవహరించాలి. ఇది కేవలం ఒక నాయకురాలికి జరిగిన అవమానం కాదు, ప్రతి మహిళా గౌరవానికి సంబంధించిన అంశం" అని నాయకులు అన్నారు. రాజకీయ భేదాలు సహజమే కానీ వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీయడం సరికాదని, ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మహిళా ఎమ్మెల్యేల గౌరవాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన ప్రభుత్వమే, పోలీసు యంత్రాంగమే ఇలాంటి చర్యలకు పాల్పడితే ఎలా అని ప్రశ్నించారు.

**మహేశ్వరం గడ్డ నుంచి ఒక్కటే నినాదం**

**మహిళా గౌరవాన్ని కాపాడాలి, ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలి!**

మాజీ మంత్రి , బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి, పై జరిగిన సంఘటనకు నిరసనగా మహేశ్వరం మండల కేంద్రంలో తీవ్ర నిరసనలతో అట్టుడికింది.

సబితా ఇంద్రారెడ్డి, పై జరిగిన ఘటనను వారు తీవ్రంగా ఖండించారు. ప్రజలకు సేవలందిస్తున్న మహిళా ప్రజాప్రతినిధి పట్ల ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు. ప్రజా జీవితంలో ఉన్న మహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేసిన మహిళా నాయకురాలు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హైకోర్టు వారు కఠినంగా వ్యవహరించాలని కోరారు.

**"ఇది కేవలం ఒక నాయకురాలికి జరిగిన అవమానం కాదు"**

సబితా ఇంద్రారెడ్డి, పై నిన్న అసెంబ్లీ సాక్షిగా జరిగిన ఘటనను ప్రతి మహిళా గౌరవానికి సంబంధించిన అంశంగా చూస్తున్నామని. ప్రజాస్వామ్యంలో రాజకీయ భేదాలు సహజం.



కానీ వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసే ఉండకూడదని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గ ప్రజల తరపున ఈ ఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నామని, ప్రజాస్వామ్య పద్ధతిలో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు.

మహేశ్వరం మండల కేంద్రంలో జరిగిన నిరసనతో సబితా ఇంద్రారెడ్డి,కి మద్దతుగా పార్టీ శ్రేణులు ఒక్కతాటిపైకి వచ్చాయి. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు. మహిళ ఎమ్మెల్యేల గౌరవం, ప్రజాస్వామ్య విలువలు, ప్రజాప్రతినిధుల పట్ల మర్యాదను కాపాడాల్సిన ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం పై ఉందని కాపాడాల్సిన వారే ఇలాంటి చర్యలకు పాల్పడితే ఎలా అని పేర్కొన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహేశ్వరం గడ్డ నుంచి ఒక్కటే నినాదం మహిళా గౌరవాన్ని కాపాడాలి, ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలి, ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజల గొంతు వినిపించాలి ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ కార్యదర్శి మూర్కుంట్ల అరవింద్ శర్మ, నియోజకవర్గ ఉపాధ్యక్షులు లక్ష్మీ నరసింహ రెడ్డి, హనుమగళ్ళ చంద్రయ్య, వివిధ మండలాలు డివిజన్ల అధ్యక్షులు అంగోత్ రాజు నాయక్, అర్కల కామేష్ రెడ్డి, రామిడి రామిరెడ్డి, జల్లెల్ల లక్ష్మయ్య, పెండ్యాల నగేష్ (హౌస్ అరెస్ట్), పి.ఏ.సి.ఎస్ చైర్మన్లు మంచే పాండు యాదవ్, చెంద్రశేఖ, సీనియర్ నాయకులు కర్రోళ్ల చంద్రయ్య, అంబయ్య యాదవ్, పి.సుధాకర్ రెడ్డి, డి.వెంకటేశ్వర రెడ్డి, మునగపాటి నవీన్, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఉప సర్పంచులు వార్డు సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ చైర్మన్లు,

మహిళా నాయకురాల్లు సుశీల రెడ్డి, లలితా జగన్, గీత రవికుమార్, మునగపాటి స్వప్న నవీన్, పంతంగి మాధవి, వంగేటి లక్ష్మి, దీపికా శేఖర్ రెడ్డి, స్వప్న జంగారెడ్డి, ముత్యాల లలితా కృష్ణ, సునీత పటేల్, ధనలక్ష్మి రాజు, రేఖ లక్ష్మణ్, పద్మా అంజయ్య, అనిత అనిల్ కుమార్ యాదవ్, రేఖా రమేష్, సునీత బాలరాజ్, జెన్నపల్లి పద్మ, సభావత్ మంజుల, జటోత్ సుజాత, కత్రావత్ భామిని, డి కృష్ణవేణి, కాడమోని స్వాతి ప్రభాకర్, అవులకాడి, సున్నం స్వప్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరంలో శిథిల విద్యుత్ స్తంభాల తొలగింపుకు చర్యలు

### సర్పంచ్ వినతితో గ్రామాన్ని సందర్శించిన విద్యుత్ డిఈ

### ప్రజల భద్రతే ప్రధానం - వదులుగా ఉన్న వైర్ల మరమ్మతుకు ఆదేశం

మహేశ్వరం, సెప్టెంబర్ 08:వార్త వేదిక సూర్య

మహేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, గ్రామంలో పాడైపోయిన శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాల ఏర్పాటు, వదులుగా ఉన్న విద్యుత్ వైర్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని గ్రామ సర్పంచ్ శ్రీ మునగపాటి నవీన్, విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ (డి ఈ ) కి వినతి పత్రం సమర్పించారు. ఈ వినతికి స్పందించిన కందుకూరు డివిజన్ విద్యుత్ శాఖ డి ఈ గోపాలకృష్ణ గారు, మహేశ్వరం ఏ ఈ శ్రీ చక్రపాణి మహేశ్వరం గ్రామాన్ని సందర్శించి, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలు, వదులుగా ఉన్న విద్యుత్ తీగలను స్వయంగా పరిశీలించారు.

ప్రజలకు ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అవసరమైన చోట్ల కొత్త స్తంభాలు ఏర్పాటు చేయడం, వదులుగా ఉన్న తీగలను సరిచేయడం వంటి చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

అనంతరం సర్పంచ్ మునగపాటి నవీన్ మాట్లాడుతూ.. గ్రామంలో పాడైన స్తంభాలు, వదులుగా ఉన్న వైర్ల సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖతో సమన్వయం చేసి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని, ప్రజల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత సురక్షితంగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జొర్ల రమేశ్, వార్డు సభ్యులు ఆకుల వీరిబాబు, సున్నం కృష్ణ, గ్రామ ప్రజలు రాజు పాల్గొన్నారు.



## అండర్-16 హెచ్‌సీఏ స్కూల్ లీగ్‌లో సాయి అనురాగ్ రాథోడ్ సత్తా

### బౌలింగ్‌లో 6/15.. బ్యాటింగ్‌లో 37 నాటౌట్

మహేశ్వరం సెప్టెంబర్ 08: వార్త వేదిక సూర్య

అండర్-16 హెచ్‌సీఏ స్కూల్ లీగ్‌లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్) నాదర్‌గుల్ జట్టు సత్తా చాటింది. మొయినాబాద్ లోని శ్రీనివాస్ రెడ్డి-2 క్రికెట్ గ్రౌండ్‌లో ఓక్‌రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ బాచుపల్లితో జరిగిన మ్యాచ్‌లో డీపీఎస్ నాదర్‌గుల్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ అనంతరం తొలుత బ్యాటింగ్ చేసిన ఓక్‌రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ జట్టు 22.3 ఓవర్లలో 83 పరుగులకే ఆలౌట్ అయింది. డీపీఎస్ నాదర్‌గుల్ బౌలర్ ఎన్. సాయి అనురాగ్ రాథోడ్ అద్భుతంగా బౌలింగ్ చేసి ప్రత్యర్థి బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. 6 వికెట్లు పడగొట్టి కేవలం 15 పరుగులు మాత్రమే ఇచ్చి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం 84 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన డీపీఎస్ నాదర్‌గుల్ జట్టు 10.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ మ్యాచ్‌లో బౌలింగ్‌తో మెరిసిన సాయి అనురాగ్ రాథోడ్.. బ్యాటింగ్‌లోనూ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 37 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టు విజయానికి తనవంతు సహకారం అందించాడు. ఒకే మ్యాచ్‌లో 6 వికెట్లు తీసుకోవడంతో పాటు 37 పరుగులతో నాటౌట్‌గా నిలిచి ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచిన సాయి అనురాగ్ రాథోడ్‌పై కోచ్‌లు, పాఠశాల నిర్వాహకులు, సహచరులు ప్రశంసలు కురిపించారు.

## నేటి నుంచి అక్టోబర్ 8 వరకు పోషణ మాసం

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :

రాజేంద్రనగర్ ప్రాజెక్ట్ పరిధిలోని రాజేంద్రనగర్, గండిపేట, శేరిలింగంపల్లి మండలాల్లో నేటి నుంచి అక్టోబర్ 8 వరకు 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ కవిత తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో రోజువారీ కార్యక్రమాల ప్రణాళిక ప్రకారం పోషకాహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోషణ మేళాలు, పోషకాహార వంటకాల ప్రదర్శనలు, తల్లిదండ్రుల సమావేశాలు, పిల్లల ఆరోగ్యం, అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారం, వేడి వండిన భోజనం, తీసుకెళ్లే పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. మన అంగన్‌వాడీ-మన బాధ్యత అనే నినాదంతో నిర్వహించే పోషణ మాసం కార్యక్రమాల్లో ప్రజలు, తల్లిదండ్రులు, స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీ కమిటీ సభ్యులు చురుకుగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీడీపీఓ కవిత కోరారు.

## సబితా ఇంద్రారెడ్డిని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై సోమ వారం జరిగిన అనూహ్య సంఘటన నేపథ్యంలో మంగళవారం ఉదయం కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ నాయకత్వంలో నాయకులు సుభాష్ రెడ్డి, రమేష్ ముదిరాజ్, రాము యాదవ్ తదితరులు సబితా ఇంద్రారెడ్డిని కలిసి సోమవారం చోటుచేసుకున్న సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమెకు ధైర్యం చెప్పి తమ సంఘీభావాన్ని తెలిపారు. నాయకులు మాట్లాడుతూ, సబితా ఇంద్రారెడ్డికి పార్టీ శ్రేణులు ఎల్లప్పుడూ అండగా ఉందామని పేర్కొన్నారు.

వార్త వేదిక సూర్య VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2 సంచిక : 112
బుధవారం 09 సెప్టెంబర్ 2026



## మహేంద్రనాథ్ గ్రామాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత టైలర్ సేవ

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :**
ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని మహేంద్రనాథ్ గ్రామాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ విద్యార్థుల అభ్యున్నతికి వారి ఆనందాన్ని చూడటానికి తల్లిదండ్రులు లేని, నిరుపేద విద్యార్థులను ఆదుకునే లక్ష్యంతో చేపట్టిన సేవ కార్యక్రమం వస్త్ర దాతల సహకారంతో ఈ సంస్థ నిరంతరం ఉచితంగా దుస్తులు కుట్టించి సేవలందిస్తోందని సంస్థ అధ్యక్షులు తెలిపారు.

ఈ సందర్భంగా అధ్యక్షులు జల్లి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో మనమంతా ఎన్నో ఆర్భాటాలతో, పండుగలు, పుట్టినరోజులు మరియు ప్రత్యేక వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నాం. కొత్త బట్టలు కొనుగోలు చేస్తూ ఆనందాన్ని పంచుకుంటున్నాం. కానీ, మన చుట్టూ ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో కనీస అవసరాలకు నోచుకోని ఎంతో మంది అభాగ్యులున్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు లేని నిరుపేద విద్యార్థులు ఎదుర్కొనే ఇబ్బందులు వర్ణనాతీతం. కనీసం ఒంటిపై మంచి బట్టలు లేక, కొత్త వస్త్రాలు ధరించే అదృష్టం లేక కుమిలిపోయే ఎంతోమంది చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మహేంద్రనాథ్ గ్రామాభివృద్ధి సంస్థ ముందుకు వచ్చిందని అన్నారు.

కుటుంబ సభ్యుల పుట్టినరోజు వేడుకల సందర్భంగా పెద్దల జ్ఞాపకార్థంతో

తల్లితండ్రులు లేని పిల్లలకు వస్త్ర దానం ద్వారా వారి స్మృతులు చిరస్థాయిగా నిలిచిపోవడంతో పాటు, పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది, తోటివారికి సహాయం చేయడంలో ఉన్న ఆనందమే అసలైన మానవత్వం సోంత లాభం లో కొంత మానుకొని సమాజానికి తిరిగి ఎంతో కొంత ఇవ్వడం మన బాధ్యత వస్త్ర దాతలు వాట్సాప్ నంబర్ 9666150874 సంప్రదించాలని కోరారు.

## అతిథి అధ్యాపక పోస్టుల నియామకానికి ధరఖాస్తుల ఆహ్వానం

**మహబూబ్ నగర్ బ్యూరో సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :**
మహబూబ్ నగర్ జిల్లాకేంద్రంలోని యన్.టి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అటానమస్ లో 2026-27 విద్యాసంవత్సరానికి గాను, కంప్యూటర్ సైన్స్ 1 మరియు హెల్త్ కేర్ 1 సబ్జెక్టులలో అతిథి అధ్యాపకుల గెస్ట్ ఫ్యాకల్టీ కొరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ అమినా ముంతాజ్ జహన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పి.జిలో సంబంధిత సబ్జెక్టులో 55% శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50% శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలి. హెల్త్ కేర్ సబ్జెక్టు అర్హతగా పి.జి (జువాలజీ) చేసిన అభ్యర్థులు అర్హులు అలాగే నెట్, స్లెట్, సెట్, పి.హెచ్.డి ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది. పై సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకునేవారు, అన్ని సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో ఈనెల సెప్టెంబర్ 10 వ తేదిన సాయంత్రం 5 గంటలలోపు యన్.టి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆఫీసునందు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 11 న ఉదయం 10 గంటలకు యన్.టి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మహబూబ్ నగర్ లో ఇంటర్వ్యూ మౌఖిక పరీక్ష, డెమోకు హాజరు కావాలని, కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ అమీనా ముంతాజ్ జహాన్ తెలిపారు.

# లక్ష్మీనాపురం రిజర్వాయర్‌ను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగు, గ్రామాలకు తాగునీరు అందించాలి

### సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున



**నాంపల్లి సెప్టెంబర్ 08( వార్త వేదిక సూర్య):**
నల్గొండ జిల్లా నాంపల్లి మండలం వీర తెలంగాణ పోరాట పురిటిగడ్డ నల్లగొండ జిల్లా కేంద్రంలో నవంబర్ 15 నుంచి 18 వరకు జరగనున్న అఖిల భారత 36వ రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున పిలుపునిచ్చారు. మంగళవారం నాంపల్లి మండల కేంద్రంలో రైతులు, వ్యాపారస్తులకు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి రైతు సంఘం జాతీయ నాయకులు, కేంద్ర కమిటీ సభ్యులు, ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరవుతారని తెలిపారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, పంటలకు గిట్టుబాటు ధర, నాణ్యమైన ఎరువుల సరఫరా, వ్యవసాయ రంగంపై ప్రభుత్వాల విధానాలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించి భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. నవంబర్ 15న లక్ష మంది రైతులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. నాంపల్లి ప్రాంతంలోని లక్ష్మీనాపురం రిజర్వాయర్‌ను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు అందించాలని నాగార్జున డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న భారత్--అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రైతాంగానికి ప్రమాదకరమని, విద్యుత్ సంస్కరణ బిల్లు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా రైతాంగాన్ని ఐక్యం చేసి ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామని తెలిపారు. ఢిల్లీలో రైతులు ఏడాది పాటు నిర్వహించిన పోరాటం ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లిఖితపూర్వక హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు స్పందించకపోతే భవిష్యత్‌లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి, మండల కమిటీ సభ్యులు వాషిపాక ముత్తిలింగం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము లక్ష్మయ్య రాజు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలి

**జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్**

**వినాయక చవితి ఉత్సవాలకు జిల్లాలో డి.జె ఏర్పాటుకు అనుమతులు లేవు**

**ప్రజలకు,వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా విగ్రహాలను రోడ్డు కు ఇరుపక్కల ప్రతిష్ఠించుకోవాలి**

**సోషల్ మీడియా పై ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు**

**ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసు వారి సూచనలు పాటిస్తూ సహకరించాలి..**



**నల్లగొండ బ్యూరో, సెప్టెంబర్ 8 (వార్తా వేదిక సూర్య )**
రానున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో శాంతియుత వాతావరణం భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ప్రజలకు ఇబ్బంది కలిగించే అధిక శబ్దం కలిగించే లౌడ్ స్పీకర్లు,డి.జె లకు అనుమతి లేదని జిల్లా ఎస్పి ఒక ప్రకటనలో తెలిపారు. డి.జే నిర్వాహకులు ఎట్టి పరిస్థితుల్లోనూ వినాయక మండపాల వద్ద గాని ఊరేగింపులకు గాని డి.జేలు ఏర్పాటు చేయకూడదని అన్నారు. గణేష్ విగ్రహాల వద్ద నిర్వాహకులు స్పీకర్లను తక్కువ సౌండ్ తో రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని, ఎవరైనా నిర్వాహకులు లౌడ్ స్పీకర్లు, డి.జె. సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు, ఇతర ప్రార్థనా మందిరాలకు ఇబ్బంది కలిగేలా చేయరాదు అన్నారు. మండప నిర్వాహకులు ప్రజలకు వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా విగ్రహాలను రోడ్డు కు ఇరుపక్కల ప్రతిష్ఠించుకోవాలనీ సూచించారు. సోషల్ మీడియాలో ఇతర మతాల వారి మనోభావాలు దెబ్బతీసే విధంగా పోస్టులు చేస్తే కఠిన చర్యలు తప్పవని సోషల్ మీడియా పై ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మండప నిర్వహకులు అవసరమైన అన్ని శాఖల అనుమతులు తీసుకోవాలని కోరారు. వినాయక విగ్రహాల ఏర్పాటు చేయుటకు ని ం ా వ ఎ ౕ ా క ౕ ు ల ు https://policeportal.tspolice.gov.in/index.htm లో వివరాలు పొందుపరిచి అప్లికేషన్‌ను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసు వారి సూచనలు పాటిస్తూ సహకరించగలరని కోరారు.

**గణేష్ మండప నిర్వాహకులు పాటించవలసిన నిబంధనలు**

1. మండపం ఏర్పాటు చేయు స్థలం వారి యాజమానుల అనుమతులు తీసుకోవాలి.
2. గణేష్ మండపాల కొరకు విద్యుత్ శాఖ వారి అనుమతితోనే కనెక్షన్ తీసుకోవాలి.
3. షార్ట్ సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరు ఉపయోగించాలి.
4. గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లను మండపంలో ఏర్పాటు చేయాలి.
5. గణేష్ మండపాలను ఎవరికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి.
6. గణేష్ ప్రతిమలు కూర్చుండబెట్టే ప్రదేశంలో మంచి నాణ్యత గల స్టేజ్ మరియు షెడ్ ఏర్పాటు చేయవలెను.
7. గణేష్ మండపంలో 24 గంటలు ఇద్దరు వాలంటీర్ ఉండే విధంగా నిర్వహకులు తగు చర్యలు తీసుకోవాలి.
8. గణేష్ మండపాలకు వచ్చే భక్తుల సందర్శన దృష్టిలో ఉంచుకుని, మండపాలలో భక్తుల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు వాలంటీర్లను నియమించాలి.
9. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట అడటం, అసభ్యకరమైన నృత్యాల ఏర్పాటు, అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం, పాటలు పాడటంపై పూర్తిగా నిషేధం.
10. విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి, పోలీసు అధికారుల తనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం సూచనలు చేస్తారు.
11. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు విదిగా ఏర్పాటు చేసుకోవాలి.
12. మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 112 గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి.
13. సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి రూమర్స్, వదంతులను నమ్మకూడదు, ఎవ్వరికైనా ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత పోలీసు వారికి లేదా డయల్ 112 కి సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.




## కంది సూర్యనారాయణకు లక్ష్మణ్ స్మారక పురస్కారం

**నల్లగొండ బ్యూరో, సెప్టెంబర్ 8 (వార్తా వేదిక సూర్య )**



సమాజ సేవలో చేస్తున్న కృషికి గుర్తింపుగా ప్రముఖ గాంధీయవాది కంది సూర్యనారాయణకు మిరియాల లక్ష్మణ్ స్మారక పురస్కారం మంగళవారం హైదరాబాద్ కోటిలోని బీసీ సాధికారత సంస్థ ఆడిటోరియంలో నాయి బ్రాహ్మణ జన సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి పురస్కారాన్ని అందజేశారు. సమాజ సేవతో పాటు బీసీ సంఘం, నాయి బ్రాహ్మణ సమాజానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ రాపోలు సుదర్శన్, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మోరంగం పెల్లి భాగయ్య, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ అశోక్ కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సావిత్రి, చాదర్ఘట్ సీతారామలయం ట్రస్ట్ వైస్ చైర్మన్ కె విజయ్ సాయి, అంబర్పేట కృష్ణ లు అందజేశారు. ఈ సందర్భంగా కంది సూర్యనారాయణ మాట్లాడుతూ.. యువత సమాజ సేవలో ముందుకు రావాలని, మహిళలు స్వాలమ్మన సాధించేలా కుట్టు శిక్షణ అందించేందుకు ప్రత్యేక కేంద్రం భవనం ఏర్పాటు చేయాలని లక్ష్యంతో కృషి చేస్తున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఆర్థికంగా వైద్యం చేయించుకోలేని వారికి వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ జన సంస్థ గౌరవ అధ్యక్షుడు పి వినోద్ కుమార్, అధ్యక్షులు శ్రీధర్ మురహరి, ప్రధాన కార్యదర్శి నవనీత, ఉపాధ్యక్షుడు డాక్టర్ సుశీల్ కుమార్, కే జయంతి, మంజుల, జ్యోష్ణ, వై రేణుక, డాక్టర్ వెంకటేష్, కార్యదర్శి ఎం ప్రతాప్, కోశాధికారి వీ. రాజయ్య, సహాయ కార్యదర్శి ఎం సదానందం, కార్యవర్గ సభ్యులు ఎం తిరుపతి, ప్రవీణ్, సిహెచ్ విక్రమ్, నేలపట్ల సత్యనారాయణ, కంది హనుమాన్ ప్రసాద్, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్‌కు ఎస్.ఎఫ్.ఐ--డి.వై.ఎఫ్.ఐ ప్రతినిధుల వినతి

**నల్లగొండ బ్యూరో, సెప్టెంబర్ 8 (వార్తా వేదిక సూర్య )**



నాగార్జున ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎస్.ఎఫ్.ఐ--డి.వై.ఎఫ్.ఐ నల్గొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దేవసేన కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ తెలంగాణ కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డి.వై.ఎఫ్.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లం మహేష్ మాట్లాడుతూ, నాగార్జున ప్రభుత్వ కళాశాలలో సంవత్సరాలుగా విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కళాశాలలో లైబ్రేరియన్ లేకపోవడం, సెక్యూరిటీ గార్డులు లేకపోవడం, కనీస మౌలిక వసతులు సరిగా లేకపోవడం వల్ల విద్యార్థుల విద్యాభ్యాసానికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.

విద్యార్థులకు అవసరమైన గ్రంథాలయ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, కళాశాల ప్రాంగణంలో భద్రతను పెంచేందుకు సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని, అవసరమైన అన్ని కనీస మౌలిక వసతులను వెంటనే కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ తక్షణమే స్పందించి, కాలపరిమితితో కూడిన చర్యలు చేపట్టాలని ఎస్.ఎఫ్.ఐ--డి.వై.ఎఫ్.ఐ నల్గొండ జిల్లా కమిటీ కోరింది.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నల్గొండ డివిజన్ కార్యదర్శి మారుపాక కిరణ్, ఎస్ఎఫ్ఐ నల్గొండ డివిజన్ ఉపాధ్యక్షులు విశ్వనాధుల వేణు చారి, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు పాలాధి కార్తీక్ ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ నాయకులు అదిల్, రాము, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ విద్యార్థులకే పతకాల పంట

**పాల్వంచ,సెప్టెంబర్ -08, (వార్త వేదిక సూర్య): (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)**
హైదరాబాద్‌లో ఈ నెల 6 తేదీ నా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తైకా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన ఎక్స్‌ట్రీమ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. జాతీయ స్థాయి క్రీడాకారులు పోటీపడిన ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్వంచ విద్యార్థులు తమ మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలతో సరికొత్త రికార్డులు సృష్టించారు. విజేతల వివరాలు:హర్షిక: బ్లాక్ బెల్ట్ గ్రాండ్ ఛాంపియన్‌షిప్ విభాగంలో అమోఘమైన ప్రదర్శనతో 'గ్రాండ్ ఛాంపియన్' టైటిల్‌ను కైవసం చేసుకుంది. దితిక శ్రీ: అసాధారణ ప్రతిభతో కటాస్ విభాగంలో గోల్డ్ మెడల్, ఫైట్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి డబుల్ గోల్డ్‌తో మెరిసింది. జెస్సీ: కటాస్ విభాగంలో సిల్వర్ మెడల్, ఫైట్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. అర్జున్: ఫైట్ విభాగంలో గోల్డ్ మెడల్, కటాస్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. రిష్వన్ సింబా: కటాస్‌లో గోల్డ్ మెడల్, ఫైట్‌లో బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నాడు. అల్తాఫ్: కటాస్ విభాగంలో అద్భుత ప్రదర్శనతో గోల్డ్ మెడల్ సాధించాడు. హ్యారీ: కటాస్ మరియు ఫైట్ రెండు విభాగాల్లోనూ బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. దేవాన్ష్: కటాస్ మరియు ఫైట్ విభాగాల్లో బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నాడు. మాస్టర్ కోనే సూరిబాబు హర్షం: ఈ ఘన విజయంపై ఎక్స్‌ట్రీమ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ముఖ్య శిక్షకులు (మాస్టర్) కోనే సూరిబాబు మాట్లాడుతూ.. "పాల్వంచ లాంటి ప్రాంతం నుండి వెళ్లిన విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో, కఠినమైన శిక్షణ పొంది హైదరాబాద్‌లో జరిగిన ఇంత పెద్ద ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించడం మా అకాడమీకే కాక, యావత్ జిల్లాకే గర్వకారణం" అని అన్నారు. భవిష్యత్తులో ఈ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణను అందిస్తామని ఆయన పేర్కొన్నారు. పాల్వంచ ప్రాంత కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటిన ఈ విజేతలను వారి తల్లిదండ్రులు, అకాడమీ మేనేజ్‌మెంట్, క్రీడాభిమానులు మరియు పట్టణ ప్రముఖులు ఘనంగా అభినందించారు.



# ఫిజియోథెరపీ శాశ్వత ఆరోగ్యం

### లయన్స్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :**
నాగర్ కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ లయన్ రాధాకృష్ణ పట్టణానికి చెందిన ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సుమంత్ ను శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. అనంతరం రాధాకృష్ణ మాట్లాడుతూ, "ఆధునిక జీవనశైలి, గంటల తరబడి సెల్ ఫోన్, కంప్యూటర్ వాడకం, శారీరక శ్రమ లేమి కారణంగా నేడు 20 ఏళ్ల వయసు నుండే యువత నడుము నొప్పి, మెడ నొప్పి, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. అలాంటి వారికి మందులు, సర్జరీలు లేకుండా కేవలం ఫిజియోథెరపీ వ్యాయామాలతోనే శాశ్వత ఉపశమనం కల్పించవచ్చు. నాగర్ కర్నూల్ ప్రజలకు డాక్టర్ సుమంత్ అందిస్తున్న నిస్వార్థ సేవలు ఎంతో అభినందనీయం అని కొనియాడారు. డాక్టర్ సుమంత్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ తనను సన్మానించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలని, సరైన భంగిమలో కూర్చోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ జోన్ చైర్మన్ కైలాష్ జవర్ షిరిడీ సాయి పారా మెడికల్ కళాశాల సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాక-మునిపంపుల గ్రామాల్లో రోడ్డు గుంతలను వెంటనే పూడ్చాలి

- ప్రమాదకరంగా మారిన రోడ్డు గుంతలపై అధికారులు నిర్లక్ష్యం వీడాలి
- కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో డీఈ కాళీ కుర్చీకి వినతిపత్రాలు ఇచ్చి సీపీఎం సర్పంచుల వినూత్న నిరసన

**రామన్నపేట సెప్టెంబర్ 8 (వార్తా వేదిక సూర్య ):** దుబ్బాక--మునిపంపుల గ్రామాల మధ్య అస్తవ్యస్తంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్డు గుంతలను వెంటనే పూడ్చి, ప్రజల సమస్యను పరిష్కరించాలని మునిపంపుల, దుబ్బాక గ్రామాల సర్పంచులు బొడ్డుపల్లి వెంకటేశం, గట్టు నర్సింహా డిమాండ్ చేశారు. రోడ్డు మరమ్మతుల విషయంలో పలుమార్లు సంబంధిత ఆర్‌డబి అధికారులను కలిసి విన్నవించినప్పటికీ అధికారులు అందుబాటులో లేకపోవడం, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం వినూత్న నిరసన చేపట్టారు. అధికారులు కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో ఆర్‌డబి డీఈ ఖాళీ కుర్చీకి వినతిపత్రాలు సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. ప్రజలు నిత్యం ప్రయాణించే ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయని, ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు, ప్రయానికులు తీవ్ర





ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన రోడ్డు గుంతలను పూడ్చడంలో ఆర్‌డబి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. ప్రజల సమస్యలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, పాదయాత్ర, ధర్నాలు, వినతి పత్రాలు అందించి నిరసనలు చేసినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. రెండు రోజుల్లో రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించకపోతే ఆయా గ్రామాల ప్రజలను సమీకరించి నిరవధిక నిరాహార దీక్ష చేపడతామని, ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ప్రజల సమస్యల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత ఆర్‌డబి అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు మేడి గణేష్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు గుండాల నరేష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, వేముల మల్లేశం, కంబాలపల్లి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు



యాదాద్రి భువనగిరి

# గణేష్ మండప నిర్వాహకులకు సూచనలు జారీ

- వలిగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి

**వలిగొండ, సెప్టెంబర్ 8 (వార్తా వేదిక సూర్య):** వినాయక చవితి పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు మరియు ఇతర ప్రభుత్వ శాఖల ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ మరియు ప్రజల భద్రత దృష్ట్యా పలు సూచనలు జారీ చేశారు.



**ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపిన ముఖ్యమైన నిబంధనలు:**

ముందస్తు అనుమతి తప్పనిసరి గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీస్, విద్యుత్ శాఖ, మరియు మున్సిపల్/గ్రామ పంచాయతీ అధికారుల నుండి ముందస్తు అనుమతి పత్రాలను పొందాలి. ట్రాఫిక్కు అంతరాయం కలగవద్దు: రోడ్లపై రాకపోకలకు ఇబ్బంది కలిగేలా, వాహనాల రాకపోకలను అడ్డుకునేలా మండపాలను ఏర్పాటు చేయకూడదు. డీజేలపై నిషేధం ధ్వని కాలుష్యం: రాత్రి వేళల్లో సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయం దాటిన తర్వాత మైకులు, ధ్వని కాలుష్య కారక పరికరాలను వాడకూడదు. డీజేల వాడకంపై కఠిన నిబంధనలు వర్తిస్తాయిభద్రతా చర్యలు ల సీసీ కెమెరాలు ప్రతి మండపం వద్ద నిర్వాహకులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి వేళల్లో మండపం వద్ద కనీసం ఇద్దరు లేదా ముగ్గురు నిర్వాహకులు తప్పనిసరిగా కాపలా ఉండాలి. పోలీస్ స్టేషన్ నుండి తప్పకుండా అనుమతులు తీసుకోవాలని తెలిపారు. శోభయాత్ర సమయములో ఎవరైనా శాంతి భద్రతలకి విఘాతం కలిగించినట్లయితే చట్టపరముగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

## ప్రజలకు మౌళిక సదుపాయాల కల్పనకు నిరంతర కృషి

**మోత్కూరు, సెప్టెంబర్ 08 (వార్త వేదిక సూర్య):** ప్రజలకు మౌళిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నానని మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 6వ, వార్డు ఇందిరా నగర్ స్మశాన వాటికలో నూతన బోర్ ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ గోలుకొండ నర్సయ్య ,స్థానికులు కందుకూరి మురళి తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో నిరంకుశ పాలన

ఆర్ఎస్.రాష్ట్ర.నాయకుడు ధర్మేందర్ రెడ్డి



**మోత్కూరు, సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలన కొనసాగిస్తోందని, ప్రజా సమస్యలను పక్కనపెట్టి ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకోవడమే ప్రభుత్వ ప్రధాన అజెండాగా మారిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నెవూరి ధర్మేందర్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ డైవర్షన్ డ్రామాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని అన్నారు. ప్రతిపక్ష నేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చావును కోరుకోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. కేసీఆర్ చావును కోరుకున్న ఎమ్మెల్యే వీరపల్లి శంకర్‌పై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. హోం మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే ఇదంతా జరుగుతోందని ఆయన ఆరోపించారు. అసెంబ్లీని ఏకపక్షంగా నడిపిస్తున్నారని ప్రతిపక్షం ప్రశ్నిస్తున్నదనే భయంతో ప్రతిపక్ష సభ్యులను అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేలపై దాడులు చేయడం కాకుండా మహిళ ఎమ్మెల్యేల పట్ల కూడా అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా దళిత బంధు వంటి గొప్ప పథకాన్ని తీసుకొచ్చిన వ్యక్తి కేసీఆర్ ఆ పథకాన్ని నిర్వీర్యం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డినే అన్నారు. పోలీసులు కాంగ్రెస్ పార్టీకి కొమ్ముకాస్తున్నట్లు వ్యవహరిస్తున్నారని ఇది ఎప్పటికీ కూడా చెల్లదన్నారు. ప్రతిపక్ష నేతపై దాడికి వెళ్తున్న వారిని పోలీసులు దగ్గరుండి తీసుకెళ్తున్నారని...కానీ కేసీఆర్ ఇంటికి వెళ్తున్న తమ పార్టీ నాయకులను మాత్రం అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారని ప్రభుత్వ వైఖరిని తప్పు పట్టారు. అసెంబ్లీలో కీలకపాత్ర పోషిస్తున్న బారాస ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు, గుంటకండ్ల జగదీష్ రెడ్డి గార్లతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అక్రమంగా అరెస్టు చేసి, అడుగడుగునా నిర్బంధాలకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ అధినేత కేసీఆర్ జోలికి వస్తే చూస్తూ ఊరుకోం. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కేసీఆర్ నేడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారంటే అది కేసీఆర్ సాధించిన తెలంగాణ రాష్ట్రం వల్లనే. అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోంది. ఎమర్జెన్సీ తరహా పాలన కొనసాగుతోందన్నారు. ప్రజా సమస్యలను మరచిపోయిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకోవడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. రానున్న రోజుల్లో. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది. ప్రజా వ్యతిరేక విధానాలకు దీటుగా బదులిస్తామని హెచ్చరించారు.

# డిగ్రీ కళాశాలలు బంద్ విజయవంతం



**మోత్కూరు, సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య):** గత 4 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్ ను బకాయిలను వెంటనే విడుదల చేయాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల యజమాన్యాల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చౌగోని సత్యం గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఫీజు రీయంబర్స్ మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల యజమాన్యాల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మోత్కూరులో సంతోష్, సాయిరాం డిగ్రీ కళాశాలలు బంద్ సంపూర్ణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం గౌడ్ మాట్లాడుతూ ఫీజు రీయంబర్స్ మెంట్ సకాలంలో రాకపోవడం వల్ల రాష్ట్రంలో సుమారు 14 లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫీజు రీయంబర్స్ మెంట్ విడుదల చేయాలని గత వారం రోజుల నుంచి వివిధ దశలలో తమ నుంచి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకమన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల ఉన్నత చదువుకొరకై వెంటనే ఫీజు రీయంబర్స్ మెంట్ విడుదల చేయాలని, లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేలపట్ల చేనేత సొసైటీ మధ్యంతర స్టే, క్రిమినల్ ఆదేశాలను అమలు చేయాలి

**చౌటుప్పల్ సెప్టెంబర్ 8 వార్తా వేదిక సూర్య :** చౌటుప్పల్ మండలంలోని నేలపట్ల గ్రామ హ్యాండ్లూమ్ రివర్స్ కోఆపరేటివ్ సొసైటీ కి నిర్వహించిన ఎన్నికల ఫలితాలపై ఆగస్టు 5 వ తేదీన కోపరేటివ్ ట్రిబ్యునల్ కోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్ ను అమలుపరచాలని చేనేత జౌళి శాఖ యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ సంచాలకులు మంగళవారం నోటీసు జారీ చేశారు. ఈ మేరకు నేలపట్ల గ్రామంలోని చేనేత సొసైటీ భవనానికి నోటీసులను ఏడిఓ గోపాల్ అంటించారు. నేలపట్ల చేనేత సొసైటీ అధ్యక్షులుగా ఎన్నికైన పిల్లలమరి శ్రీనివాస్ నియామకం చెల్లదని కొంతమంది డైరెక్టర్లు ఇటీవల సొసైటీ ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించారు. పిల్లల మరి శ్రీనివాస్ కు ముగ్గురు సంతానం ఉన్నారు. సొసైటీ ఎన్నికల నియమావళి ప్రకారం ఇద్దరు కన్నా ఎక్కువ సంతానం కలిగిన వారు సొసైటీ ఎన్నికల్లో పోటీ చేయరాదు అన్న నిబంధన మేరకు విచారించి ఆగస్టు 5 2026న పిల్లల మరి శ్రీనివాస్ ఎన్నిక మరియు చైర్మన్ నియామకంపై మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. స్టే ఆర్డర్ తో పాటు హ్యాండ్లూమ్స్ మరియు టెక్స్టైల్స్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం రోజు సొసైటీ భవనానికి నోటీసు అంటించారు. అదేవిధంగా పిల్లలమర్రి శ్రీనివాస్ కు సోషల్ మీడియా ద్వారా నోటీసు పంపించినట్లు చేనేత జౌళి శాఖ యాదాద్రి భువనగిరి జిల్లా ఏడిఓ గోపాల్ తెలిపారు. క్రిమినల్ కోర్టు నుండి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు సొసైటీ లో మధ్యంతర స్టే ఆర్డర్ ఆదేశాలను న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా వ్యవహరించాలని సొసైటీ కార్యదర్శి కి సూచించినట్లు పేర్కొన్నారు. ఆయనతోపాటు డైరెక్టర్లు గంజి శ్రీనివాసులు, తడక కోటేశ్వర్ పాల్గొన్నారు.



# ముత్తిరెడ్డిగూడెం పాఠశాలలో ప్రతిభావంతులకు నగదు పురస్కారాలు

- టెన్త్ టాపర్లకు ఎన్నారై ప్రశాంత్ రెడ్డి ఆర్థిక ప్రోత్సాహం
- చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచన

**మోటకొండూర్, సెప్టెంబరు 8(వార్త వేధిక సూర్య):** –మోటకొండూర్ మండలంలోని ముత్తిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎన్నారై దాత పీసరి ప్రశాంత్ రెడ్డి బుధవారం నగదు పురస్కారాలు అందజేసి సత్కరించారు. పాఠశాల స్థాయిలో 538/600 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన కుమారి దుంప సంధ్యకు రూ. 10,000, అలాగే 522/600 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన కుమారి అలకుంట్ల సింధుశ్రీకి రూ. 2,500 నగదు బహుమతులను అందజేసి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఎన్నారై ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం సబ్జెక్టు నాలెడ్జ్











కే పరిమితం కాకుండా, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ బుడిగె బాలరాజు మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు చలికాలంలో స్వెట్టర్లు, పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించిన ప్రశాంత్ రెడ్డి సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో దాత పీసరి ప్రశాంత్ రెడ్డి, సర్పంచ్ బాలరాజు, గ్రామస్తులు బీరప్ప, పన్నీరు భరత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తునందుకే బిఆర్ఎస్ నేతలను అక్రమ అరెస్టులు

**మోత్కూరు, సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య):** గత 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన ఆందోళన కార్యక్రమాలను పోలీసులను అడ్డం పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టు చేస్తుందని బిఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై మంగళవారం జిల్లా,మండల కేంద్రాలలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలను అందజేసే కార్యక్రమంలో తమతో పాటు పార్టీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడంతో పాటు వివిధ పోలీస్ స్టేషన్ లలో నిర్బంధించారని ఆరోపించారు. అరెస్టు చేసిన నాయకులు తక్షణ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి తో పాటు మాజీ ఎంపిటిసి పానుగుళ్ల విష్ణుమూర్తి, యువజన విభాగం నాయకులు బందెల శ్రీను, కంచర్ల క్రాంతి కుమార్ రెడ్డి లు ఉన్నారు. కెసిఆర్ ఫామ్ హౌస్ పై కాంగ్రెస్ నిరసన. అడ్డుకోవడానికి వెళితే......

అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా సోమవారం ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై మాజీ ముఖ్యమంత్రి బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ క్షమాపణలు చెప్పాలంటూ కాంగ్రెస్ నేతలు ప్రకటించడాన్ని నిరసిస్తూ మోత్కూరు బి.ఆర్.ఎస్ నా యకులు ఆ నిరసన అడ్డుకోవడానికి వెళుతున్న క్రమంలో తుర్కపల్లి పోలీసులు అడ్డుకొని అక్కడ పోలీస్ స్టేషన్ తరలించినట్లు బి.ఆర్.ఎస్ నాయకులు తెలిపా రు. అరెస్ట్ అయిన వారిలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్ నాథ్, మండల పట్టణ అధ్యక్షులు పోన్నెబోయిన రమేష్, జంగ శ్రీను ,పట్టణ ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేశం, జిల్లానాయకులు దాసరి తిరుమలేష్ కొండ సోంమల్లు జిట్టా సాయికుమార్ తదితరులు ఉన్నారు.



# రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో పేదలకు సంక్షేమ పథకాలు

**మోత్కూరు, సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య):** బిఆర్ఎస్ పదేళ్ల పరిపాలనలో తెలంగాణ ప్రజలకు ఏం మాత్రం న్యాయం జరగలేదని, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటైన రేవంత్ రెడ్డి ప్రజా పరిపాలనలో పేదలకు లేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లను, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను , గృహజ్యోతి , మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతోపాటు, ఒక లక్ష రూపాయల వరకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. గత గత పదేళ్లలో వివాహాలు చేసుకొని కనీసం రేషన్ కార్డు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పాటు చేశారని, నేడు రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ కొనసాగించడంతోపాటు,10 ఏళ్లలో పిల్లల పేర్లను రేషన్ కార్డులో నమోదు చేయలేదని, ఆప్షన్ కూడా ఇచ్చామని పేర్కొన్నారు. తాము చేస్తున్న అభివృద్ధి పనులను ఓర్వలేక తమ ఉనికిని కాపాడుకోడానికి బిఆర్ఎస్ నాయకులు తహతహలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి ప్రజావాణిని కూడా రాష్ట్రంలో అన్ని మండలాలలో మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణిని కొనసాగిస్తున్నామని , ప్రజలు తద్వారా దూర ప్రయాణం తగ్గించుకొని తమ సమస్యల పరిష్కరించుకుంటున్నారని. తెలిపారు. ఇకనైనా బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రజాపాలనపై విమర్శలు మానుకోవాలని కోరారు.



వార్త వేదిక సూర్య VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2, సంచిక : 112 || బుధవారం సెప్టెంబర్, 9, 2026 ||



# యాదాద్రి భువనగిరి

# కాంగ్రెస్ పార్టీ శ్రేణుల భారీ నిరసన రాస్తారోకో

**- బీఆర్ఎస్ నేతల తీరును నిరసిస్తూ దాదాపు 1,000 కార్లతో ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులు**

**- పోలీసుల అడ్డగింత**

**తుర్కపల్లి సెప్టెంబర్ 8 వార్త వేదిక సూర్య** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ నిరసన రాస్తారోకో నిర్వహించారు. తెలంగాణ అసెంబ్లీ ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరును తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుల తీరును తీవ్రంగా ఖండించిన నాయకులు, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా దళిత వర్గానికి చెందిన స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ పై చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ పార్టీ, ఆ పార్టీ ముఖ్య నాయకులు దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని డప్పులు వాయిస్తూ, నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ నేతల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో తుర్కపల్లి మండల కేంద్రంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. చిట్యాల--ఢిల్లీ హైవేపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, కీసర--యాదగిరిగుట్ట హైవేపై కూడా వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం "కేసీఆర్ రాజకీయ చావు డప్పు" కార్యక్రమంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా బయలుదేరారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య , ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 1,000 కార్లతో ఫామ్‌హౌస్ ముట్టడికి బయలుదేరగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అసెంబ్లీ ప్రాంగణం ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజాస్వామ్యానికి, శాసనసభ గౌరవానికి విరుద్ధంగా






వ్యవహరించినందుకు నిరసనగా తుర్కపల్లి మండల కేంద్రంలో భారీ రాస్తారోకో నిర్వహించినట్లు పేర్కొన్నారు. సభాపతి పదవికి ఉన్న గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీల తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిల శాసన మండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తెలంగాణ ప్రజలకు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కి బహిరంగంగా క్షమాప ణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభ, శాసనమండలి వంటి ప్రజాస్వామ్య వ్యవస్థలకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని, భవిష్యత్‌లో ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు, అవమానకరమైన చర్యలకు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని బీర్ల అయిలయ్య కోరా రు. కాంగ్రెస్ పార్టీ దళితుల గౌరవాన్ని పెంచే విధంగా పనిచేస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో దళితుల పాత్ర ఎంతో కీలకంగా ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ వద్ద 125 అడుగుల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి మరో వైపు 125 అడుగుల వరకు దళిత బిడ్డలను అణిచివేసే వేస్తున్నారని అన్నారు. దళిత బిడ్డలకు ఆత్మగౌరవం ఉందని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అన్ని వర్గాలను కలుపుకొని ప్రజాపాలన అందిస్తోందని అన్నారు. ప్రజాపాలన వచ్చిన తర్వాత కూడా దళితులను అణిచివేసే ధోరణి కొనసాగడం బాధాకరమన్నారు. ఒక దళిత బిడ్డగా ఉన్న తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారిని ఉద్దేశించి ఆయన తల్లిని ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఎమ్మెల్సీలు చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. దళితుల ఆత్మగౌరవం కోసం ఎంత దూరమైనా వెళ్తామని, ఎంతటి వారినైనా ఎదుర్కొంటామని బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. దళిత బిడ్డల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు రోడ్లపై బైఠాయించి రాస్తారోకో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నిరసనలో డప్పు ఉన్న ప్రతి ఒక్క వ్యక్తి ఒక డప్పుగా మారి డప్పులు వాయిస్తూ తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు పరిమితమైనప్పటికీ, బీఆర్ఎస్ నాయకుల ఆగడాలు మాత్రం ఆగడం లేదని బీర్ల అయిలయ్య విమర్శించారు. దళితుల గౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరించే వారిని ప్రజలు తగిన విధంగా నిలదీయాలని పిలుపునిచ్చారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత



**మోత్కూరు/ అడ్డగూడూరు 08 ( వార్త వేదిక సూర్య):** అడ్డ గూడూరు మండలంలోని కొండంపేట గ్రామానికి చెందిన కడారి సాయికి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స చేయించుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన సాయి ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి సహకారంతో దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి సాయికి 90 వేల రూపాయల చెక్కు మంజూరు కాగా ఆ చెక్కును ఆ గ్రామ సర్పంచ్ గొలుసుల లక్ష్మి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఇటికాల కుమారస్వామి చేతుల మీదుగా ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఇటికాల లక్ష్మి,,యాదగిరి, శోభ తదితరులు పాల్గొన్నారు.

# గీత సొసైటీకి ముగిసిన నామినేషన్ల దాఖలు



**మోత్కూరు, సెప్టెంబర్ 8 (వార్త వేదిక సూర్య)** మోత్కూరు కల్లుగీత కార్మిక సంఘం ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల గడువు చివరి రోజైన మంగళవారం మొత్తం 9 డైరెక్టర్ స్థానాలలోని 7 జనరల్ స్థానాలకు 16 నామినేషన్లు, 2 మహిళ స్థానాలకు 3 నామినేషన్లు రాగా మొత్తం 19 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి, జిల్లా కో-ఆపరేటివ్ సీనియర్ ఇన్ స్పెక్టర్ వి. విజయకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9న స్క్రూటినీ, 10 న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ,అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

# సదర్శాపూర్ వాసికి డాక్టరేట్...

**- నిరుపేద కుటుంబం నుంచి ఉన్నత.విద్యకు నోచుకొనికుగ్రామం నుంచి అంచెలంచెలుగా ఎదిగిన శివకుమార్ నేటికి యువతకు ఆదర్శం. పలువురు హర్షం.**



**మోత్కూరు, సెప్టెంబర్ 08 ( వార్త వేదిక సూర్య):** మోత్కూరు మండలంలోని ఓ మారుమూల కుగ్రామమైన సదర్శాపూర్ గ్రామానికి చెందిన తీగల శివకుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. తీగల యాదగిరి--ఎల్లమ్మ దంపతుల కుమారుడైన శివకుమార్, ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ (జియాలజీ) పూర్తి చేశారు. అనంతరం సైంటిఫిక్ ఆఫీసర్ (ఏ ఎం. డి ) జి. నాగేంద్రబాబు ,గుండా ప్రభాకర్ పర్యవేక్షణలో జియాలజీ అండ్ జియోకెమిస్ట్రీ ఆఫ్ పొదిలి గ్రానైట్, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్" అనే అంశంపై పరిశోధనలు నిర్వహించి తన పరిశోధన పత్రాలను సమర్పించడం ద్వారా యూనివర్సిటీ అధికారులు 85 వ కన్వకేషన్ పురస్కరించుకొని మంగళవారం ఆయనకు డాక్టరేట్ ప్రకటించారు. నిరుపేద కుటుంబానికి చెందిన శివకుమార్ తన ప్రాథమిక విద్యాభ్యాసం 1వ,తరగతి నుండి 3వతరగతి ప్రాథమికోన్నత చదువుకున్నారు. ఆ తదుపరి 4వ తరగతి నుండి 10 తరగతి చైతన్య భారతి ఉన్నత పాఠశాల ఉప్పల్ లో ఇంటర్మీడియట్. రాజాపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో డిగ్రీ సైన్స్ కాలేజ్ సైఫాబాద్ పీజీ పీహెచ్ డి ని ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేసినట్లు శివకుమార్ "వార్త వేదిక సూర్య ప్రతినిధికి తెలిపారు. తన తల్లిదండ్రులు కూలీ నాలీ పనులు చేసుకుంటూ తనను ఉన్నత విద్యకు ప్రోత్సహించారని తెలిపారు.. శివకుమార్ వ్రాసిన పరిశోధన పత్రాలు ఇంటర్నేషనల్ జర్నల్స్ అయినా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ), ఇటాలియన్ జర్నల్ ఆఫ్ జియోసైన్సెస్(ఐ.జె యు ) లో ప్రచురితం అయ్యినట్టు చెప్పారు. తనను ఇంతటి స్థాయికి తీసుకువచ్చిన తల్లిదండ్రులకు జీవితాంతం రుణపడి ఉంటానని శివకుమార్ పేర్కొన్నారు. శివకుమార్ డాక్టరేట్ పొందటం పట్ల తల్లిదండ్రులతో ఆ గ్రామ సర్పంచ్ మునుకుంట్ల నీలకంఠం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు తీగల సైదులు మాదిగ గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

# నకిరేకల్ ఆసుపత్రి ప్రారంభం.. రామన్నపేటకు ఎప్పుడు?

**- సీఎం సభలో రామన్నపేట ఆసుపత్రి ప్రస్తావనే లేదు**

**- నాలుగైదుగురు వైద్యులతోనే సేవలా?.. 24 గంటల అత్యవసర వైద్యంపై ఆందోళన**

**- 100 పడకల హామీ ఎక్కడ? వైద్యులు, సిబ్బంది, మౌలిక వసతులు ఎప్పుడు?**



**రామన్నపేట, సెప్టెంబర్ 8 (వార్తా వేదిక సూర్య):** నకిరేకల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో ప్రభుత్వం ముందుకు సాగుతున్న వేళ.. అదే నియోజకవర్గంలోని రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితి మాత్రం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. నకిరేకల్ ఏరియా ఆసుపత్రిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించినా.. రామన్నపేట ఆసుపత్రి గురించి కనీసం ప్రస్తావన లేకపోవడం స్థానికుల్లో అసంతృప్తికి కారణమవుతోంది. 'నకిరేకల్ ఆసుపత్రి సరే.. రామన్నపేట పరిస్థితి ఏంటి?' అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రామన్నపేటతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ప్రభుత్వ వైద్యంలో ప్రధాన ఆధారంగా ఉన్న ఏరియా ఆసుపత్రిలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, మౌలిక వసతుల కొరతపై చాలాకాలంగా ఫిర్యాదులు ఉన్నాయి. ప్రస్తుతం సుమారు నాలుగైదుగురు వైద్యులతోనే సేవలు కొనసాగుతున్నట్లు సమాచారం. రోజువారీ ఓపీ, ఇన్‌పేషెంట్లతో పాటు అత్యవసర కేసులు వస్తున్న నేపథ్యంలో ఇంతమంది వైద్యులతో పూర్తి స్థాయి సేవలు ఎలా అందుతాయన్న ప్రశ్న తలెత్తుతోంది.

### అత్యవసర వేళల్లో పరిస్థితి ఏమిటి?

ప్రమాదాలు, ప్రసవ అత్యవసరాలు, పాముకాట్లు, గుండె సంబంధిత సమస్యలు తదితర కేసులు రాత్రి వేళల్లో వచ్చినప్పుడు తక్షణ వైద్యం అత్యంత కీలకం. 24 గంటల అత్యవసర సేవలకు నిరంతరం వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆక్సిజన్, అత్యవసర మందులు, మానిటర్లు, అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండాలి. అయితే రామన్నపేట ఆసుపత్రిలో ఈ వ్యవస్థ ఏ స్థాయిలో ఉందన్న దానిపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. గతంలోనూ వైద్యుల కొరతపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. 24 మంది వైద్యులు ఉండాల్సిన చోట కేవలం నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పూర్తిస్థాయిలో పరిష్కారం లభించలేదన్న అభిప్రాయం స్థానికుల్లో ఉంది.

### 100 పడకల హామీ ఏమైంది?

రామన్నపేట ఆసుపత్రిని 100 పడకల స్థాయికి పెంచాలన్న డిమాండ్ కూడా ఎన్నాళ్లుగానో పెండింగ్‌లోనే ఉంది. 2024లో అప్పటి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి ఆసుపత్రిని 100 పడకలకు పెంచడంతో పాటు అవసరమైన వైద్యులను నియమించాలని కోరినట్లు నమోదైంది. 2025లోనూ ఇదే డిమాండ్‌తో నిరసనలు జరిగాయి. ఇప్పుడు నకిరేకల్‌లో ఆధునిక ఏరియా ఆసుపత్రి ప్రారంభమవుతున్న నేపథ్యంలో రామన్నపేటకు ఇచ్చిన హామీల పరిస్థితి ఏమిటి? 100 పడకల ఆసుపత్రి ఎప్పటికి అందుబాటులోకి వస్తుంది? ఖాళీ పోస్టులను ఎప్పుడు భర్తీ చేస్తారు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ఒక నియోజకవర్గం.. రెండు ఆసుపత్రుల పరిస్థితులు

నకిరేకల్ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి స్వాగతించదగ్గదే అయినా.. అదే నియోజకవర్గ పరిధిలోని రామన్నపేట ఆసుపత్రిని కూడా ప్రభుత్వం సమాన ప్రాధాన్యంతో చూడాలని ప్రజలు కోరుతున్నారు. కొత్త ఆసుపత్రి ప్రారంభోత్సవం సందర్భంగా రామన్నపేటకు సంబంధించిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లకపోవడం బాధాకరమని స్థానికులు అంటున్నారు.

'ఒకచోట కొత్త ఆసుపత్రి ప్రారంభిస్తే.. మరోచోట ఉన్న ఆసుపత్రిలో కనీస వైద్య సిబ్బంది కోసం ప్రజలు ఎందుకు ఎదురుచూడాలి?' అని వారు నిలదీస్తున్నారు.

### సమగ్ర తనిఖీ చేయాలి

రామన్నపేట ఆసుపత్రిలో మంజూరైన వైద్యుల పోస్టులు ఎన్ని? ప్రస్తుతం పనిచేస్తున్నవారు ఎంతమంది? ఖాళీలు ఎన్ని? నర్సింగ్, ఇతర సిబ్బంది పరిస్థితి ఏమిటి? 24 గంటల అత్యవసర సేవలు పూర్తిస్థాయిలో అందుతున్నాయా? రోజువారీ ఓపీ, ఇన్‌పేషెంట్ సంఖ్య ఎంత? అత్యవసర కేసుల్లో ఎంతమందిని ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు? వంటి వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రి భవనం, పడకలు, మందులు, ఆక్సిజన్, ల్యాబ్, ఎక్స్‌రే, అత్యవసర పరికరాలు, అంబులెన్స్, రిఫరల్ వ్యవస్థపై సమగ్ర తనిఖీ నిర్వహించి లోపాలను సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నకిరేకల్ ఏరియా ఆసుపత్రి ప్రారంభంతో వైద్య రంగంలో ప్రభుత్వం చూపిన చొరవను స్వాగతిస్తూనే.. రామన్నపేట ప్రజల ఆరోగ్య హక్కును కూడా ప్రభుత్వం పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నకిరేకల్ ఆసుపత్రి ప్రారంభమైంది.. మరి రామన్నపేట ఆసుపత్రి ఎప్పుడు బలోపేతం అవుతుందో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఉద్యోగుల డిమాండ్ల సాధనకు 10న చలో హైదరాబాద్

**- లక్ష మందికిపైగా హాజరయ్యేలా కార్యాచరణ లో భువనగిరి నుండి పది వేల మంది ఉద్యోగస్తులును తరలించుటకు ఏర్పాట్లు**

**- యాదాద్రి భువనగిరి జిల్లా ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ ధరణికోట భగత్**



**చౌటుప్పల్ సెప్టెంబర్ 8 వార్తా వేదిక సూర్య :** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలన్నీ న్యాయమైన డిమాండ్లేనని, వాటిని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ నీ సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోలేదని తెలిపారు. సమస్యల పరి ష్కారం కోసం ఈనెల 10న ఎల్బీ స్టేడియం లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్'లో భాగంగా 'హక్కుల సాధన సభ లో జిల్లా నుండి వేలాది ఉద్యోగస్తులు పాల్గొంటారని వారు వెల్లడించారు. బుధవారం చౌటుప్పల్ లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో సభ పోస్టర్ ను జేఏసీ నేతలు ఆవిష్కరించారు. ఉద్యోగ, ఉపా ధ్యాయ, పెన్షనర్ సంఘాల నేతలు సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీజీఈజేఏసీ జిల్లా కన్వీనర్ భగత్ మాట్లాడుతూ.. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి మూడేండ్లవుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వం నివేదిక తీసుకోలేదన్నారు. ఆరు డీఏలు పెండింగ్ లో ఉన్నాయని, సీపీఎస్ ను రద్దు చేసి ఓపీఎస్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల కోసం ప్రభుత్వం జారీ చేసిన ఈహెచ్ఎస్ జీవో అమలు కావడం లేదని,. ప్రైవేట్ ఆస్పత్రులు సైతం ఈహెచ్ఎస్ ను అంగీకరించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ నాయకులు, ఎండిఓ, డివిజనల్ పరిపాలన అధికారి, ఉపాధ్యా సంఘ నాయకులు యాదయ్య, రమేష్, రాములు లింగయ్య పంచాయతీ రాజ్ శాఖ శ్రీకాంత్ రెడ్డి, శశికాంత్ గౌడ్, రమాదేవి జిల్లా నాయకులు ఖదీర్, శ్రీకాంత్, జానయ్య శ్రీనివాస్ పెన్షనర్ సంఘం నుండి మోహన్ రెడ్డి బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.







Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**